జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 130 | శనివారం 4 అక్టోబరు- 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

# ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం... కీలక నిర్ణయాలు ఇవే!

- ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ. 15 వేల ఆర్థిక సాయం అందించే పథకానికి ఆమోదం
- అమరావతి అభివృద్ధి పనుల వేగవంతానికి ఎస్‌పీవీ ఏర్పాటు
- రాజధానిలో మిగిలిన భూముల సేకరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- టెక్ హబ్‌ల ఏర్పాటుకు 'లిఫ్ట్' పాలసీకి అనుబంధ ప్రతిపాదనల ఆమోదం
- ఈ నెల 16న ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై మంత్రులకు దిశానిర్దేశం
- రాష్ట్రంలో కారవాన్ టూరిజం పథకానికి మంత్రివర్గం ఆమోదం



అమరావతి,అక్టోబర్ 3(సందేశం టైమ్స్) : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల సంక్షేమంతో పాటు రాజధాని అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు సుమారు 20 అజెండా అంశాలపై కేబినెట్ చర్చించి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు రాష్ట్ర ప్రగతికి మరింత ఊతమిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

**ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆర్థిక అండ**

రాష్ట్రంలోని ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు అండగా నిలుస్తూ రూ. 15,000 ఆర్థిక సాయం అందించే పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గతంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందుల నుంచి డ్రైవర్లను ఆదుకునే లక్ష్యంతో ఈ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తున్నారు. ఈ పథకాన్ని శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. "ప్రతి వర్గాన్ని ఆదుకోవడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ సాయం వారి జీవనోపాధికి భరోసా ఇస్తుంది" అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయంతో లక్షలాది మంది డ్రైవర్లు లబ్ధి పొందనున్నారు.

**అమరావతి నిర్మాణానికి కీలక అడుగులు**

రాజధాని అమరావతి అభివృద్ధి పనులను పరుగులు పెట్టించేందుకు కేబినెట్ రెండు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. మొదటిది, అమరావతిలో మౌలిక సదుపాయాలు, రోడ్లు, భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడానికి ఒక ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్‌పీవీ) ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ ఎస్‌పీవీ ద్వారా నిధుల సమీకరణ, పనుల పర్యవేక్షణ సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. "అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించాలంటే ఎస్‌పీవీ ఏర్పాటు ఎంతో అవసరం. ఇది పనుల్లో వేగాన్ని, పారదర్శకతను పెంచుతుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దీంతో పాటు, ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాని మిగిలిన భూములను భూసేకరణ చట్టం ప్రకారం సేకరించేందుకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**టెక్నాలజీ, పర్యాటక రంగాలకు ప్రోత్సాహం**

రాష్ట్రంలో టెక్నాలజీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఉద్దేశించిన 'ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ (లిఫ్ట్)' పాలసీ 2024-29కి సంబంధించిన అనుబంధ ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. ఇది ఐటీ, బయోటెక్ వంటి రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు, రాష్ట్రంలో పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు 'కారవాన్ టూరిజం' పథకానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**ప్రధాని పర్యటన, ఇతర నిర్ణయాలు**

ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో, ఏర్పాట్లపై కూడా కేబినెట్ భేటీలో చర్చించారు. కర్నూలులో జరగనున్న ఎన్‌డీఏ ర్యాలీ, జీఎస్టీ తగ్గింపుపై రాష్ట్రవ్యాప్తంగా 60 వేలకు పైగా అవగాహన సభలు నిర్వహించాలని మంత్రులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వీటితో పాటు జలవనరుల శాఖ పరిధిలోని పలు పనులకు, అమృత్ 2.0 పథకం కింద 20 మున్సిపాలిటీలలో చేపట్టే అభివృద్ధి పనులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలన్నీ 'సూపర్ సిక్స్' హామీల అమలులో భాగమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## వరద పరిస్థితులపై హోంమంత్రి అనిత ఆరా



అమరావతి,అక్టోబర్ 3(సందేశం టైమ్స్) : భారీ వర్షాలతో నాగావళి, వంశధార నదులు ఉప్పొంగిన నేపథ్యంలో శ్రీకాకుళం, మన్యం, విజయనగరం కలెక్టర్లు, ఎస్పీలతో హోంమంత్రి వంగలపూడి అనిత ఈరోజు (శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత వరద పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని... ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వరద సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించాలన్నారు.

వంశధార, నాగావళి నది లోతట్టు ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని ఆదేశించారు. విపత్తుల సమాచారం, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. విపత్తుల సంస్థ హెచ్చరిక సందేశం వచ్చినప్పుడు ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోమ్, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత సూచనలు చేశారు.మరోవైపు వంశధార నది పరివాహక ప్రాంతంలో దిగువున ఉన్న గ్రామ ప్రజలకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటించారు. వంశధార నదికి గొట్ట బ్యారేజ్ వద్ద దిగువకు 1,04,891 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం తెలియజేయాలని కలెక్టర్ స్వప్నిల్ ఆదేశించారు.

## వైసీపీ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు షాక్



అమరావతి,అక్టోబర్ 3 (సందేశం టైమ్స్) : వైసీపీ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు బిగ్ షాక్ తగిలింది. పైడి తల్లి సిరిమానోత్సవం రోజున బొత్స కుటుంబం డీసీసీబీ బ్యాంక్ వద్ద కూర్చోవడానికి వీల్లేదంటూ ప్రస్తుత ఆలయ కమిటీ చైర్మన్ కిమిడి నాగార్జునహుకుం జారీ చేశారు. సిరిమానోత్సవం చూడటానికి ఇది బొత్స పార్టీ కార్యాలయం కాదని ఆయన స్పష్టం చేశారు. కాగా, బొత్స కుటుంబం 3 దశాబ్దాలుగా ఇదే బ్యాంక్ వద్ద నుంచి సిరిమానోత్సవాన్ని చూస్తోంది.

## పండుగ సీజన్ తో శ్రీవారికి రికార్డు స్థాయిలో కానుకలు



(సందేశం టైమ్స్) : తిరుమల శ్రీవారి ఆలయంలో ఘనంగా జరిగిన సాలకట్ల బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులుగా భక్తులను మంత్రముగ్ధులుగా మార్చి, గురువారం రాత్రి ధ్వజావరోహణ కార్యక్రమంతో ముగిసాయి. ఈ సందర్భంగా తిరుమలలోని ప్రధాన దేవస్థానాధికారి శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, సివిఎస్ఓ మురళీకృష్ణ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తొమ్మిది రోజుల పాటు జరిగిన ఈ బ్రహ్మోత్సవాలను చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులకు తిరుమలకు చేరుకున్నారు. భక్తులందరూ శ్రీవారి 16 వాహన సేవలతో పాటు మూలమూర్తిని దర్శనం చేసుకున్నారని టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు చెప్పారు.శ్రీవారి బ్రహ్మోత్సవాలలో 8 రోజుల్లో 5.80 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు

## ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ కార్యక్రమాలు: పీవీఎన్ మాధవ్



రాజమండ్రి,అక్టోబర్ 3(సందేశం టైమ్స్) : ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. భారతదేశం అనేక విదేశీ సవాళ్లని ఎదుర్కొంటున్నా.. మోదీ ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని ఉద్ఘాటించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ రంగంలో విదేశాలకు ఎగుమతులు పెరిగాయని గుర్తుచేశారు పీవీఎన్ మాధవ్.(శుక్రవారం) రాజమండ్రి సుబ్రహ్మణ్యం మైదానంలో ఖాదీ సంతను పీవీఎన్ మాధవ్ సందర్శించారు. ఖాదీ వస్త్రాలు వినియోగిస్తా మని పీవీఎన్ మాధవ్ ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా పీవీఎన్ మాధవ్ మీడియాతో మాట్లాడారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జీఎస్టీ గురించి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. జీఎస్టీ 2.0ని కాంగ్రెస్ రాష్ట్రాలు కూడా అంగీకరించిన విషయం రాహుల్ గాంధీకి తెలియదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు పీవీఎన్ మాధవ్.

## అమరావతిలో మలేషియా బృందం పర్యటన



అమరావతి,అక్టోబర్ 3(సందేశం టైమ్స్) : మలేషియా ప్రజాప్రతినిధుల బృందం రాజధాని అమరావతిలో శుక్రవారం పర్యటించింది. రాజధానిలోని నిర్మాణాల గురించి వారికి మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవ్ తేజ వివరించారు. సీడ్ యాక్సెస్ రహదారి పక్కనే నిర్మిస్తున్న సీఆర్డీఏ నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ సముదాయాల వివరాలను మలేషియా బృందానికి అధికారులు తెలిపారు. రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రపంచలో టాప్ 5 రాజధానుల్లో అమరావతిని ఒకటిగా రూపుదిద్దుతామని స్పష్టం చేశారు. అమరావతిలో పెట్టుబడులు పెట్టడానికి మలేషియాకు చెందిన పలు ప్రైవేటు సంస్థలు ఆసక్తి కనబరిచినట్లు మంత్రి తెలిపారు. రాబోయే 5 ఏళ్లలో రూ.6 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేలా పలు ప్రాజెక్టులను మంత్రి నారాయణకు మలేషియా ప్రతినిధులు వివరించారు.

## ఏపీ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

అమరావతి,అక్టోబర్ 3(సందేశం టైమ్స్) : విద్యాశాఖ ఇంటర్మీడియట్ పరీక్షలు షెడ్యూల్‌ను విడుదల చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలుకానున్నాయి. తొలి రోజు, అంటే ఫిబ్రవరి 23న, ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు లాంగ్వేజ్ పేపర్ పరీక్ష జరగనుంది. ఆ మరుసటి రోజు, ఫిబ్రవరి 24న, సెకండియర్ విద్యార్థులకు లాంగ్వేజ్ పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి.

# విజయవంతంగా నవరాత్రి ఉత్సవాలు





సందేశం టైమ్స్: సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, 3 అక్టోబర్సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూర్ మండలం, బోరంచ గ్రామంలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న దాతలకు ఆలయ ప్రధాన అర్చకులు సిద్దయ్య స్వామి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "చండీ యాగానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన దాతల సహకారం ఎంతో అభినందనీయమైంది. ఇది భక్తి భావనకు చిరునామా."సిద్దయ్య స్వామి, ప్రధాన అర్చకులుఅలాగే, స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆలయ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడాన్ని హర్షించదగ్గ విషయంగా అభివర్ణిస్తూ, "ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాల్సిన అవసరం ఉంది. దీనికై శ్రద్ధ తీసుకోవాలి." అని అన్నారు అర్చకులు సిద్ధయ్య స్వామి. ఉత్సవాలలో స్థానిక ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి కృపకుపాత్రులయ్యారు.

# దసరా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖులు

సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిఅక్టోబర్ 03ఈరోజు మెదక్ జిల్లా కౌడిపల్లి పట్టణ కేంద్రంలో మాజీ శాసనసభ్యులు నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి ని మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు ని మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖ సంఘ సేవకులు బిసి నాయకులు కాంగ్రెస్ నాయకులు బండారి గంగాధర్, శివంపేట్ మండల అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్, కొడకంచి శ్రీనివాస్, జంగం వెంకటేష్, మాజీ జెడ్పిటిసి కమలాపుల్ సింగ్, బి జె ఆర్ యువసేన అధ్యక్షులు కుమ్మరి నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారి కిష్టయ్య, బండారి నాగేష్, కర్రే శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే చిలుముల రంగారెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించడంజరిగింది.







# మహాత్మ గాంధీ జయంతి ఉత్సవాలు






సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 3అక్టోబర్ జాతిపితా – మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని, సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించిన జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడు, అహింసా సిద్ధాంతానికి మార్గదర్శకుడు మహాత్మా గాంధీ గారు. ఆయన సత్యం, అహింస, సామరస్యంతో కూడిన తత్వాలు నేటి తరానికి కూడా మార్గదర్శకాలు. మనమంతా గాంధీ సిద్ధాంతాలను ఆచరిస్తే సమాజంలో శాంతి, ఐకమత్యం మరింత బలపడుతుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఆర్ఐ. డానియెల్, వివిధ సెక్షన్లకు చెందిన డీపీఓ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

# దుర్గామాతను దర్శించుకున్న గ్రంథాలయ చైర్మన్ సువాసన రెడ్డి

సందేశం టైమ్స్: సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అక్టోబర్ 3మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సువాసన రెడ్డి , సంగారెడ్డి జిల్లా కౌడిపల్లి మండలం వెంకట్రావుపేటలోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారణ స్వాములు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో శ్రద్ధతో పూజలు నిర్వహించిన అనంతరం, స్వాములు సువాసన రెడ్డిని ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దొంతుల దుర్గయ్య, దొంతుల రాజు, మన్నె సురేష్ తదితరులు పాల్గొన్నారు. మాలధారణ స్వాముల సాన్నిధ్యంలో కార్యక్రమం భక్తిశ్రద్ధలతోజరిగింది.



# అంగరంగ వైభవంగా రావణాసుర దహనం

## రూ.26వేలకు రావణాసుర దహనం వేలం

## వివేకానంద యూత్ ఆధ్వర్యంలో

## ఐదు సంవత్సరాలుగా కార్యక్రమాలు





సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి అక్టోబర్ 3ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా కౌడిపల్లి మండలం, రాజిపేట గ్రామంలో రావణాసుర దహన కార్యక్రమాలు గ్రామానికి చెందిన వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తారు. రావణాసుర దహన కార్యక్రమం గ్రామస్తుల సమక్షంలో ప్రతి ఏటా వేలంపాట నిర్వహిస్తారు. గత సంవత్సరం గ్రామస్తులు20వేలకు రావణాసుర దహనం వేలంలో దక్కించుకోగా, ఈసారి రూ. 26000లకు మన్నే సత్యనారాయణ వేలంలో పాల్గొని రావణాసుర దహనం చేశారు. గ్రామస్తులు పోటీపడి రావణాసుర దహనం వేలంలో పాల్గొని వేలంలో తగ్గించుకున్న వారే రావణాసుర దహనం చేస్తారు. ప్రతి సంవత్సరం రావణాసుర దహనం అనంతరం గ్రామ ఆడపడుచులు, యువకులు, చిన్నారులు సైతం నృత్యాలు చేస్తూ తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ వైభవంగా రావణాసుర దహనంతోపాటు దసరా వేడుకలు నిర్వహించుకుంటారు. రావణాసుర దహనం వేలం పట్టించుకున్న మన్నే సతీష్ ను కౌడిపల్లి ఏఎస్ఐ మల్లయ్య శాలువాతో సన్మానించి అభినందించారు. గ్రామస్తులు ఇంత వైభవంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామస్తులంతా జరుపుకోవడం సంతోషంగాఉందన్నారు.

# పెద్దారెడ్డిపేట్ లో ఘనంగా దుర్గాభవాని శోభయాత్ర

## భక్తి శ్రద్ధాలతో చిందులు వేసిన మహిళలు





సందేశం టైమ్స్:పుల్కల్ మండలం ప్రతినిధి అక్టోంబర్ 03 సంగారెడ్డి జిల్లా పెద్దారెడ్డిపేట్ లో శవ నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఆయా గ్రామాలలో కొలువుదీరిన దుర్గ భవాని మాత ఉత్సవాలను గత తొమ్మిది రోజులపాటు అనునిత్యం ప్రతిరోజు అమ్మవారు వివిధ రూపాలలో ప్రజలకు దర్శనమిస్తూ ప్రజలను ఎంతో ఉత్సాహబ రీతంగా పూజలు అందుకొని శుక్రవారం నాడు నిమజ్జనానికి అమ్మవారి విగ్రహాలను ఆయా గ్రామాల సమీపంలో ఉన్న మంజీరా నదిలో నిమజ్జనం చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లప్పుడు గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఆరు ఆరోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. అంతేకాకుండా అమ్మవారి శోభయాత్ర ముందు పలు రకాల నృత్యాలు కోలాటాలు జానపద గీతాలు పాడుతూ చిందులేశారు ఈ ఆటపాటలను చూసేందుకు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వీక్షించారు దీంతో అమ్మవారి శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది నిమజ్జనానికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలను పుల్కల్ పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పుల్కల్ పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లు చేశారు దీంతో అమ్మవారి నిమజ్జనం అంగరంగ వైభవంగాజరిగింది.

# అందోల్ మండల్ పోతిరెడ్డి పల్లి గ్రామం

## శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్రోత్సవాలు



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 3అక్టోబర్ పోతిరెడ్డి పల్లి గ్రామంలో శ్రీ దుర్గాభవాని నవరాత్రి ఉత్సవాలు ఎంతో ఘనంగా జరుపుకోవడం జరిగింది శ్రీ దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో. కాంగ్రెస్ సీనియర్ నేత విగ్రహ దాత పట్లోళ్ల గౌతమ్ రెడ్డి అలాగే అన్నా ప్రసాద వితరణ కార్యక్రమము అన్నప్రసాద దాత పట్లోళ్ల రాజ మానెమ్మ – మాధవరెడ్డి చేతుల మీదగా అన్నప్రసాధన కార్యక్రమాలు జరిపారు అలాగే కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ అయినా శ్రీ బాల్ సింగ్ అమ్మవారి దర్శనాన్ని రావడంతో దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో ఆమెకు సన్మానించి సత్కరించడం జరిగింది . అలాగే బాల్ సింగ్ అభిమానుడైన పోతిరెడ్డిపల్లి కి సంబంధించిన గాండ్ల చంద్రయ్య అనబడే వ్యక్తి బాల్ సింగ్ పేరు మీద చీర అగ్రస్లో 5000 రూపాయలకు పాడడం జరిగింది శ్రీ దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాలు ఎంతో భక్తి శ్రద్దలతో పూజించి తొమ్మిది రోజులుగా ఆమెను వేడుకుంటూ గ్రామస్తులు ఎంతో ఉత్సాహంగా అమ్మవారిని అలంకరించి ఊరేగింపుగా మొదలు పెట్టడం జరిగింది డీజే చప్పులతో ఊరు వాడ ఆడపడుచులు చిన్న పెద్ద అనే తేడా లేకుండా ఆటపాటలతో కోలాటాలతో అంగరంగ వైభవంగా సంబరాలుతో ఆడుతూ పాడుతూ ఆ అమ్మవారిని శ్రీ దుర్గా భవాని అందరికీ సుఖసంతోషాలని ఇచ్చి ఆయురారోగ్యాలతో ఊరు వాడ అంతా బాగుండాలని శ్రీ దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఆరాధించడం జరిగింది అనంతరం అమ్మవారిని గంగమ్మ ఒడిలోకి చేర్చడంజరిగింది



# సంపాదకీయం

## విహార భూమిలో వలసల రగడ

బిహార్ అంటే విహార భూమి. బుద్ధుడు విహరించిన నేల. రోజూ కిలోమీటర్ల కొద్దీ నడుస్తూ కుల, మతాలకు అతీతంగా మనిషికి గుర్తింపు ఇవ్వాలని బుద్ధుడు అవిశ్రాంతంగా బోధించిన జ్ఞానభూమి. మోక్షమైనా, నిర్వాణమైనా వ్యక్తి కృషి ద్వారానే లభిస్తుంది తప్ప గుడ్డి ఆరాధనతోనూ, యజ్ఞయాగాదులతోనూ రాదని బుద్ధుడు చెప్పింది బిహార్‌లోనే. మానవ విహారానికి ఎటువంటి ఆటంకాలు ఉండకూడదని రెండున్నర వేల ఏళ్ల క్రితం బుద్ధుడు చెప్పిన చోటే ఇప్పుడు వలసలు, విహారాలపై రాజకీయాలు చెలరేగుతున్నాయి. రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే బిహార్‌లో వలసల సక్రమాలు.. అక్రమాల చుట్టూనే ప్రచారం కేంద్రీకృతం అవుతోంది. సాక్షాత్తూ ప్రధానమంత్రి, హోంమంత్రి ఈ తరహా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గతంలో బెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బంగ్లాదేశ్ అక్రమ వలసలను ప్రధాన సమస్యగా చేసుకుని ప్రచారం హోరెత్తింది. ఇప్పుడు బిహార్ వంతు వచ్చింది.%వలసలు సక్రమం అయినవైనా, అక్రమం అయినవైనా బిహార్ వాటికి ప్రధాన గమ్యస్థానం కాదు. బిహార్ లోపలికి వచ్చే వారి కంటే పొట్ట చేతపట్టుకుని బయటకి వెళ్లే వారే ఎక్కువ. 1830 నుంచి ఇప్పటివరకూ అదే కొనసాగుతోంది. నితీశ్‌కుమార్ 2005లో బిహార్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి అభివృద్ధిపరంగా అద్భుతం జరుగుతోందంటూ ప్రచారం సాగుతున్నప్పటికీ వలసలు పోయే ప్రజల శాతంలో ఆ రాష్ట్రమే అగ్రస్థానంలో ఉంది. ఎక్కడైనా ఉపాధి అవకాశాలు, మంచి జీతాలు ఉన్నచోటకే ప్రజలు వలసలు కడతారు. అవి అంతంత మాత్రం ఉన్నచోటుకు వెళ్లటం సాధ్యంకాదు. బంగ్లా అక్రమ వలసదారులు బిహార్‌ను ముంచెత్తుతున్నారని చెప్పటానికి అంకెలు, ఆధారాల కంటే.. ఒక వర్గం ప్రజల వల్లే సమస్యలన్నీ వస్తున్నాయని చెప్పటంలో రాజకీయ కోణమే కనిపిస్తోంది. ఆ వర్గాన్ని సంతృప్తిపరచే ధోరణితో రాజకీయాలు భ్రష్టుపట్టిపోతున్నాయని ఆరోపించటమూ కష్టం కాదు. కానీ అందుకు హేతుబద్ధమైన సమాచారాన్ని ఇవ్వటమే కష్టం! వలసల గురించి ప్రధానంగా మనకు లభ్యమయ్యే సమాచారం పదేళ్లకొకసారి జరిగే జనాభా లెక్కల వల్లే వస్తుంది. వీటికి తోడు జాతీయ నమూనా సర్వే సంస్థ (నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్%–% ఎన్ఎస్ఎస్ఓ) అందించే గణాంకాల వల్ల కూడా వలసల సమాచారం దొరుకుతుంది. ఈ రెండు మూలాల నుంచి వచ్చే సమాచారంలో చాలా పరిమితులు ఉన్నాయని బిహార్ వలసలపై పరిశోధించిన అమ్రితాదత్తా (హైదరాబాద్%–%ఐఐటీ) ఆధారాలతో వివరించారు. 2001 జనాభా లెక్కల ప్రకారం 79 లక్షల మంది పనుల కోసం బిహార్ నుంచి వెలుపలకు వెళ్లారు. 2011 నాటికి ఆ సంఖ్య కొంత తగ్గి 74.5 లక్షలకు చేరుకుంది. ఇలా తగ్గటానికి 2008లో ప్రపంచ వ్యాప్తంగా తలెత్తిన ఆర్థిక సంక్షోభమే ప్రధాన కారణం. అసంఘటిత రంగంపై దీని ప్రభావం అధికంగా పడింది. కార్మికుల్లో అసంఘటిత రంగంలో ఉన్న వారే (85%–%90%) ఎక్కువ. బిహార్ వలస కార్మికులు అధికంగా ఉపాధి పొందేది ఈ రంగంలోనే. ఆనాటి ఆర్థిక సంక్షోభాన్ని అర్థం చేసుకోవాలంటే మన జీడీపీని పరిశీలిస్తే సరిపోతుంది. 2007%–%08లో మన జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ) 9.3 శాతం ఉంటే ఆర్థిక సంక్షోభం వల్ల అది 6.7 శాతానికి పడిపోయింది. రెండున్నర శాతం జీడీపీ తగ్గిపోవటం మామూలు విషయం కాదు. ఒడిదుడుకులు ఎన్ని ఉన్నా బిహార్‌కు వలసలు కీలకంగా మారిపోయాయి. గ్రామీణ బిహార్‌లో ప్రతి అయిదుగురిలో ఒకరు వలస కార్మికుడిగా పనిచేసే వారే కనపడతారు. కొన్ని గ్రామాల్లో చేసిన సర్వేల్లో వలస కార్మికులు ఉన్న కుటుంబాలు 64.9 శాతం ఉన్నట్లు లెక్కలు తేలాయి.బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ప్రజలు వస్తున్నారు. దీన్ని కాదనలేం. సుదీర్ఘ సరిహద్దు ఉండటంతో పాటు వందల ఏళ్ల పాటు ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధ, బాంధవ్యాలు వలసలను ప్రభావితం చేస్తున్నాయి. అక్రమంగా వలసలు వచ్చిన వాళ్లు ఎంతమంది అనటానికి ప్రభుత్వం దగ్గర లెక్కలు పక్కాగా లేవు. బిహార్‌కు సంబంధించి అదింకా నిజం. బిహార్‌లోని ఉద్యోగాలు, వనరులను బంగ్లా ముస్లింలు కొల్లగొడుతున్నారనటానికి అక్కడి ఆర్థిక పరిస్థితులు సహకరించవు. స్వంత ప్రజలు ఎక్కువగా వలసలు పోయే పరిస్థితులు ఉన్నచోట అది సాధ్యమయ్యే పనికాదు. రాజకీయ ప్రచారానికి వాస్తవాలతో పని ఉండదు కాబట్టి ఏదైనా చెల్లిపోతుంది. దీనికి ఏ పార్టీ మినహాయింపు కాదు. ఓట్ల చోరీవల్లే అధికారాన్ని అందుకోలేక పోయామని రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రచారం కూడా ఒకరకంగా అలాంటిదే. ప్రచారాలకూ వాస్తవాలకూ ఎంతో దూరం ఉంటుందనటానికి అస్సాంలో పౌరుల జాతీయ పట్టిక (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్%–% ఎన్ఆర్‌సీ) వ్యవహారాన్ని చూస్తే అర్థం అవుతుంది. 1971 ముందు నుంచీ అస్సాంలో నివసిస్తున్నట్లుగా సాక్ష్యాధారాలు సమర్పించిన వారినే ఎన్ఆర్‌సీలో చేరుస్తామని ప్రకటించి ఆ మేరకు కసరత్తును అక్కడ పూర్తిచేశారు. 19.06 లక్షల మంది సాక్ష్యాధారాలను సమర్పించలేక పోయారు. అంటే అస్సాం జనాభాలోని 3.3 కోట్లమందిలో 6 శాతం మంది దగ్గర అవసరమైన పత్రాల్లేవు. అట్లా లేని వారందరూ ముస్లింలే అయివుంటే అక్రమ వలసదారులందరూ ఆ వర్గం వారేనని చెప్పటానికి ఆస్కారం ఉండేది. పత్రాలను సమర్పించలేని వారి సమాచారాన్ని మతాలవారీగా ప్రకటిస్తే అసలు విషయం బయటపడేది. కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదు. వివిధ అనధికార అంచనాల ప్రకారం 12 లక్షల మంది హిందువులు (63%) సాక్ష్యాధారాలను సమర్పించలేక పోయారు. ఈ 12 లక్షల మందికీ పౌరసత్వాన్ని కల్పించటానికే పౌరసత్వ చట్టానికి 2019 డిసెంబర్‌లో సవరణను తీసుకువచ్చారు. ఇది తీవ్ర వివాదానికి కారణమైంది. మతాన్ని బట్టి పౌరసత్వాన్ని కల్పించటం రాజ్యాంగానికి విరుద్ధమైందని పేర్కొంటూ పెద్ద ఆందోళనలూ తలెత్తాయి. ముస్లింలు మినహా మిగతా భారతీయ మతాలకు ఆశ్రయమిచ్చే దేశమేదీ ప్రపంచంలో లేకపోవటంతో ఆ సవరణను చేపట్టామని ప్రభుత్వం సమర్థించుకున్నా, అది రాజ్యాంగబద్ధంగా లేదని చెప్పటానికే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. దేశవిదేశాల్లో ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. పత్రాల్లేని అస్సాం ముస్లింలకు పౌరసత్వం కల్పించటానికి ఇతర ముస్లిం దేశాలు ముందుకు రాకపోతే పరిష్కారం ఏమిటి అన్న దానికి ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. ఏడు లక్షల మంది ముస్లింలను బంగ్లాదేశ్ అక్కున చేర్చుకుంటుదని కోరుకోవటం అత్యాశే అవుతుంది.అస్సాంలోనే ఈ పరిస్థితి ఉంటే బెంగాల్‌లో ఎన్ఆర్‌సీని రూపొందిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేం! బంగ్లా నుంచి తరలి వచ్చిన హిందువులందరూ అనుమతులన్నీ తీసుకుని భారత్‌లోకి అడుగుపెట్టారని చెప్పలేం. పత్రాల్లేని హిందువుల సంఖ్య అక్కడ చాలా ఎక్కువగా ఉండొచ్చు.

## విశాఖలో ప్రైవేటు బస్సులపై ఆర్టీఏ కొరడా




విశాఖపట్నం, అక్టోబరు 3 (సందేశం టైమ్స్): నగరంలో ప్రైవేటు బస్సులపై ఆర్టీఏ కొరడా ఝుళిపించింది. అగనంపూడి టోల్గేట్ జాతీయ రహదారి వద్ద ప్రైవేట్ బస్సులపై ఆర్టీఏ అధికారులు దాడులు నిర్వహించారు. దసరా పండుగ నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. పండుగ సందర్భంగా సొంతూళ్లకు పయనమయ్యారు ప్రజలు. ఈ క్రమంలో ప్రయాణికులపై అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే దాడులు చేశారు అధికారులు. బస్సుల్లో భారీగా ఛార్జీలు వసూలు చేసినట్లు గుర్తించారు. కొన్ని బస్సులపై పరిమితి నుంచి రవాణా చేస్తున్నట్లు బయటపడింది. ఇప్పటి వరకు 44 బస్సులపై అధికారులు కేసులు నమోదు చేశారు.దాదాపు నాలుగు లక్షల రూపాయలు ఫైన్ విధించారు. ఒరిస్సా, తమిళనాడుకు చెందిన బస్సులను సీజ్ చేశారు అధికారులు. ఒక్కో ప్రయాణికులపై ఐదు వందలు నుంచి 1000 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నట్టుగా అధికారులు గుర్తించారు. దీంతో అప్పటికప్పుడు ఆయా బస్సులను సీజ్ చేసిన ఆర్టీఏ అధికారులు భారీగా ఫైన్ విధించారు .

## పుట్టపర్తిలో.. మందుబాబు వీరంగం..



పుట్టపర్తి(అనంతపురం):అక్టోబరు 3 (సందేశం టైమ్స్): మద్యం ఫుల్‌గా తాగిన ఓ మందుబాబు జిల్లా కేంద్రంలోని ప్రశాంతిగ్రామ్‌లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. వివరాల్లోకి వెళితే.. ప్రశాంతిగ్రామ్ లో ఓ యువకుడు మద్యం ఫుల్‌గా సేవించి కదులుతున్న కారు టాప్ పై పడుకుని రోడ్డుకు ఇరువైపుల ఉన్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. కారు కొంత దూరం వెళ్లాక గోడను ఢీకొట్టింది. %కారు నడుపుతున్న వ్యక్తికి, కారుపై పడుకున్న మందుబాబుకు ఎలాంటి అపాయం కలగలేదు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పుట్టపర్తి పరసర ప్రాంతాల్లో ఈ మధ్య విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. దీంతో ఆధ్యాత్మిక కేంద్రానికి సమీపంలోనే మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు.

## ఏపీ ప్రజలకు అలర్ట్.. రేపు భారీ వర్షాలు..




విశాఖపట్నం:అక్టోబరు 3 (సందేశం టైమ్స్): దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాకు ఆనుకొని ఉన్న గోపాల్‌పూర్ సమీపంలో తీవ్ర వాయుగుండం తీరం దాటినట్లు వాతావరణ శాఖ తెలిపింది. క్రమంగా ఉత్తర వాయువ్య దిశగా పయనిస్తూ.. బలహీనపడుతోందని పేర్కొంది. ఈ మేరకు ప్రస్తుతం ఉత్తరకోస్తా జిల్లాల్లో.. వర్షం తగ్గుముఖం పట్టినట్లు సమాచారం. అయితే.. పలుచోట్ల చెదురుమదురుగా వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు చెప్పింది. ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉన్నట్లు బాంబు పేల్చింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో విస్తారంగా వర్షాలు కురవడంతో గోదావరికి, శ్రీకాకుళం విజయనగరం జిల్లాల్లో ఉన్న నదులకు ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. %అయితే ఇప్పటికే.. ఒడిశాలో కురిసిన వర్షాలకు శ్రీకాకుళం జిల్లాలో వరద ఉద్ధృతి పెరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ నదులకు వరద తీవ్రంగా ప్రవహిస్తోందని తెలిపారు. ఈ మేరకు గొట్టా బ్యారేజీ దగ్గర మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు అధికారులు. గొట్టా బ్యారేజీ నుంచి వచ్చిన వంశధార నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగావళి, మహేంద్రతనయ నదులలో వరద ప్రవాహం పెరుగుతోంది. వరద ఉద్ధృతికి పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్, మహేంద్రనగర్ వీధిలోకి వరద నీరు చేరింది. ఈ నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. సహాయం కోసం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏదైనా సమస్య తలెత్తితే కంట్రోల్ రూమ్: 08942–24055 నెంబర్‌కు సమాచారం ఇవ్వలని అధికారులు సూచిస్తున్నారు.

## కర్రలతో కొట్టుకున్న భక్తులు.. ముగ్గురు మృతి, 100మందికి పైగా గాయాలు




అక్టోబరు 3 (సందేశం టైమ్స్): కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టు రాత్రి రక్తసిక్తంగా మారింది. బన్ని ఉత్సవం సందర్భంగా అర్ధరాత్రి అమ్మవారి వివాహం, ఊరేగింపు మొదలైంది. అయితే ఈ సందర్భంగా దేవతామూర్తులను తీసుకెళ్లే విషయంలో భక్తుల మధ్య పోటీ మొదలైంది. ఎలాగైనా దేవతామూర్తులను తమ ప్రాంతానికే తీసుకెళ్లాలని రెండు వర్గాలు కర్రలతో ఘర్షణకు దిగాయి. ఈ సందర్భంగా భక్తులంతా రింగులు తొడిగిన కర్రలతో కొట్టుకున్నారు. ఈ గొడవలో మొత్తం ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోగా.. సుమారు 100 మందికి పైగా భక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు.దేవరగట్టులో బన్ని ఉత్సవం ప్రతి ఏటా నిర్వహించడం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా దేవతామూర్తులను కాపాడేందుకు మూడు గ్రామాల భక్తులు ఒకవైపు, ఏడు గ్రామాల భక్తులు మరోవైపు నిలబడి కర్రలతో కొట్టుకుంటున్నారు. ఈ సమరాన్ని చూసేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు తరలివస్తుంటారు. ఈ ఉత్సవం సందర్భంగా దేవతామూర్తులను కాపాడటానికి భక్తులు కర్రలతో కొట్టుకోవడం సాంప్రదాయంగా వస్తోంది.

## రాష్ట్ర రాబడి పైపైకి!




%అమరావతి, అక్టోబరు 3 (సందేశం టైమ్స్): వస్తు, సేవల పన్ను(జీఎస్టీ–2.0) శ్లాబుల మార్పుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం తగ్గుతుందన్న వాదన బుట్టదాఖలైంది. నిత్యావసరాలు సహా.. ఇతర వస్తుల పన్నులు తగ్గడంతో వాటి విక్రయాలు పెరిగాయి. దీంతో సెప్టెంబరు నెల ద్వితీయార్థంలో దేశవ్యాప్తంగా పన్నుల వసూళ్లు జోరందుకున్నాయి. అయితే, కొన్ని కొన్ని రాష్ట్రాల్లో మాత్రం తగ్గుదల నమోదైంది. గత ఏడాది(2024) సెప్టెంబరులో దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.73 లక్షల కోట్లుగా నమోదుకాగా.. ఈ ఏడాది అదే నెలలో రూ.1.89 లక్షల కోట్లు వసూలయ్యాయి. అంటే 9.1 శాతం మేర పెరుగుదల కనిపించింది. అదేసమయంలో ఈ ఏడాది ఆగస్టులో వసూలైన రూ.1.86 లక్షల కోట్ల పన్నులతో పోల్చితే సెప్టెంబరు వసూళ్లు 1.5్న అధికంగా ఉన్నాయి. దేశంలో జీఎస్టీ–2.0 సంస్కరణలు గత నెల 22 నుంచి అమలులోకి వచ్చాయి. ఫలితంగా 375 నిత్యావసర వస్తువులు సహా వస్తు సేవలు, ఆటోమొబైల్స్, గృహోపకరణాల వస్తువుల ధరలు దిగి వచ్చాయి. ఫలితంగా వాటికి డిమాండ్ పెరిగి విక్రయాలు పుంజుకున్నాయని మార్కెట్ నిపుణులు తెలిపారు.

నికర జీఎస్టీ కూడా..

గత నెలలో స్థూల జాతీయాదాయం 6.8 శాతం మేరకు పెరిగి రూ.1.36 లక్షల కోట్లకు చేరింది. మరోవైపు దిగుమతుల ద్వారా పన్ను రాబడి కూడా 15.6్న వృద్ధి చెంది.. రూ.52,492 కోట్లుగా నమోదైంది. ఇక, జీఎస్టీ రిఫండ్లు కూడా 40.1్న మేరకు పెరిగి రూ.28,657 కోట్లుగా నమోదయ్యాయి. నికరంగా జీఎస్టీ వసూలు రూ.1.60 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఏడాది సెప్టెంబరుతో పోల్చితే ఇది 5్న అధికమని మార్కెట్ వర్గాలు తెలిపాయి. తాజా పరిణామాలపై డెలాయిట్ పార్టనర్ ఎం.ఎస్. మణి స్పందిస్తూ.. జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల కారణంగా ఆర్థిక కార్యకలాపాలు మందగించలేదనడానికి ఈ వసూళ్లు నిదర్శనమని తెలిపారు. సెప్టెంబరు వసూళ్లతో ఈ ఏడాది ఇప్పటివరకు సగటు పన్నుల రాబడి రూ.2 లక్షల కోట్లకు చేరువలో ఉన్నట్టు చెప్పారు.

ఏపీలో ఇలా పెరిగింది!

రాష్ట్రాల వారీగా చూస్తే.. ఏపీలో జీఎస్టీ వసూళ్లు గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే 4 శాతం మేరకు పెరిగాయి. గత ఏడాది సెప్టెంబరులో రూ.3,506 కోట్ల జీఎస్టీ వసూలు కాగా, ప్రస్తుతం రూ.3,653 కోట్లకు చేరింది.తెలంగాణలో మాత్రం జీఎస్టీ వసూళ్లు 5 శాతం తగ్గాయి. గత ఏడాది సెప్టెంబరులో తెలంగాణలో రూ.5,267 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది రూ.4,998 కోట్లు మాత్రమే వచ్చాయి.

# రేపటి నుంచి కొత్త టీచర్లకు శిక్షణ

ఒంగోలు విద్య, అక్టోబరు 3 (సందేశం టైమ్స్): మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన 661 మందికి జిల్లాస్థాయి ప్రాథమిక శిక్షణ నుంచి ప్రారంభం కానుంది. వారికి ప్రభుత్వం ఇప్పటికే నియామక పత్రాలు జారీ చేసింది. నాలుగు కేంద్రాల్లో శిక్షణకు ఏర్పాట్లు చేశారు. పొదిలిలోని సెయింట్ మేరీ బీఈడీ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ టీచర్లకు, చీరాలలోని చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ పీఎస్, బీఎస్, గణితం టీచర్లకు శిక్షణ ఇస్తారు. చీరాల వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీలో స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య, సోషల్ టీచర్లకు, కనిగిరి ఆల్ఫా అగ్రికల్చర్ కళాశాలలో సెకండరీ గ్రేడ్ తెలుగు, ఉర్దూ టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. 3నుంచి 10వతేదీ వరకు ప్రాథమిక శిక్షణ ఇస్తారు. ఈనెల 9,10 తేదీల్లో కొత్త టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించి పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తారు.

# కర్మకాండల నిర్వహణకు నానాపాట్లు

## కరుగోరు మిల్లి కాలనీ వాసులు పరిస్థితి మరింత దయనీయం



ఆచంట( పశ్చిమగోదావరి జిల్లా) అక్టోబరు 3 (సందేశం టైమ్స్): పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలో పలు క్రైస్తవ, బీసీ స్మశానాల్లో సౌకర్యాలు కొరబడ్డాయి. ఎక్కడ చూసినా తుప్పలు పిచ్చి మొక్కలతో కనిపిస్తున్నాయి. కనీసం కూర్చోవడానికి షెడ్లు లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ అంత్యక్రియలు నిర్వహించవలసిన పరిస్థితి నెలకొంది. కరుగోరుమిల్లి గ్రామ పరిధిలోని ముత్యాలవారి పాలెం ఎస్సీ కాలనీ వాసులు పరిస్థితి దయనీయంగా ఉంది. కాలనీలో సుమారు 200 కుటుంబాల నివాసం ఉంటున్నారు. వీరికి స్మశానం లేదు. కాలనీలో ఎవరైనా చనిపోతే కర్మకాండలు నిర్వహించడానికి వారు పడే పాట్లు వర్ణనాతీతం. కాలనీ ఆనుకొని బ్యాంక్ కెనాల్ ఉంది. పంట కాలువపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్న పట్టించుకునే నాథుడు లేడు. దీంతో వారు బ్యాంక్ కేనాలపై ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి సిమెంటు స్తంభాలు మీదగా మృతదేహాన్ని నెత్తిన పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ పంట కాలువ దాటి గోదావరి తీరం వద్దకు కర్మకాండలు నిర్వహించడానికి వెళ్ళవలసి వస్తుంది. ఈ సందర్భంలో ఒకసారి పంట కాలువలోకి బోల్తా పడి గాయపడిన సందర్భాల్లో ఉన్నాయి. ప్రభుత్వ స్పందించి స్మశానాల వద్ద సదుపాయాలు కల్పించే ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# అదృశ్యమైన బాలుడి మృతదేహం లభ్యం



తెనాలి(గుంటూరు జిల్లా) :అక్టోబరు 3 (సందేశం టైమ్స్): గుంటూరు జిల్లా తెనాలిలోని బాలాజీరావు పేటలో అదృశ్యమైన ఐదేళ్ల బాలుడు ఆశిక్ రెహమాన్ మృతదేహం ఇంటి సమీపంలోని పడమర కాలువలో ఉదయం లభ్యమయింది. ఆడుకునేందుకు ఇంటి నుండి బయటకు వెళ్లి కనిపించకుండాపోయిన ఆశిక్ రెహమాన్ కోసం రాత్రంతా తల్లిదండ్రులు, బంధువులు వెతుకుతూనే ఉన్నారు. ఉదయం బాలుడి మృతదేహం లభ్యం కావడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

# తనయ నదిలో కొట్టుకుపోయిన కార్మికుడు రక్షించిన పోలీసులు



మూలపాలెం (శ్రీకాకుళం) అక్టోబరు 3 (హేలాపురి న్యూస్): : తనయ నది వరద ఉధృతికి కొట్టుకుపోయి ప్రమాదకర స్థితిలో ఉన్న కార్మికుడిని పోలీసులు రక్షించిన ఘటన రాత్రి శ్రీకాకుళం జిల్లా మూలపాలెంలో జరిగింది. బారువ, మూలపాలెం గ్రామానికి మధ్యలో గల మహేంద్ర తనయ నది పై కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జ్ పనుల కోసం వచ్చిన ఒడిశా రాష్ట్రం బాంజీ బాల్ చిలపడ గ్రామానికి చెందిన నవీన్ అనే కార్మికుడు నిన్న సాయంత్రం బ్రిడ్జ్ వద్దకు ఏవో పనిముట్లు తీసుకురావడానికి వెళ్లాడు. నిన్న కురిసిన భారీ వర్షాలకు ఒక్కసారిగా మహేంద్ర తనయ నది నీటి ఉధృతి పెరిగింది. ఆ నీటి ప్రవాహానికి నవీన్ కొట్టుకుపోయి నదిలో ఉన్న ఒక స్తంభాన్ని పట్టుకొని ఉండిపోయాడు. కార్మికుడు ప్రమాదకర స్థితిలో ఉన్నాడని సమాచారం అందడంతో బారువా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ హరిబాబు నాయుడు, సిబ్బంది జయరాం, బాలకృష్ణలు, మెరైన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి బారువా కొత్తూరు గ్రామస్తుల సహాయంతో పడవలపై వెళ్లి ఆ నదిలో చిక్కుకున్న కార్మికుడిని రక్షించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# అక్షరం నింపిన వెలుగులు

## శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువుకు విద్యుత్ లైన్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యకు పరిష్కారం



%కొత్తచెరువు,అక్టోబరు 3 (సందేశం టైమ్స్): శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులోని బీసీ కాలనీలో 'అక్షరం' వెలుగులు నింపింది. ఏళ్లుగా ఉన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపింది. దసరా పండుగ వేళ గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది. కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించి విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. చాలా ఏళ్లుగా.. ఈ బీసీ కాలనీకి విద్యుత్ సరఫరా సక్రమంగా జరక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. లో వోల్టేజీతో ఇళ్లలోని టీవీలు, ఫ్రిడ్జ్‌లు ఇతర ఎలక్ట్రికల్ సామగ్రి కాలిపోతుండేవి. తరచూ విద్యుత్ అంతరాయాలతో ప్రజలు విసిగిపోతుండేవారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 28న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఏబీఎన్ ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం జరిగింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వివిధ శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరుకాగా.. మండల ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కొత్తచెరువు బీసీ కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని షబీనా, కుళ్లాయప్ప కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. బీసీ కాలనీకి రూ.14.50 లక్షలతో 20 విద్యుత్ స్తంభాలు, 11 కేవీ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు. దీంతో కాలనీలోని 300 ఇళ్లకు విద్యుత్ సమస్య తీరింది. కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్‌నాయక్, లైన్‌మన్ రోషన్, నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, ఒలిపి శీనా, అనిల్, అరుణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

# రెండు భారీ చోరీలు.. ఆందోళనలో ప్రజలు



గుంటూరు, అక్టోబరు 3 (సందేశం టైమ్స్): జిల్లాలోని తెనాలి నియోజకవర్గంలో వేర్వేరు చోట్ల రెండు భారీ చోరీలు జరిగాయి. రెండు చోరీల్లో సుమారు 20 లక్షల విలువైన బంగారం, 5 లక్షల నగదు, మూడు ఐఫోన్లను దుండగులు అపహరించారు. తెలంగాణ ఐఆర్ఎస్ అధికారి తెనాలి చెంచుపేటలో ఓ వివాహానికి హాజరయ్యారు. ఈ క్రమంలో పార్కింగ్‌లో పెట్టిన ఐఆర్ఎస్ అధికారి కారులో బ్యాగ్‌ను దొంగలు చోరీ చేశారు. కారు అద్దం పగలగొట్టి మరీ బ్యాగ్‌ను అపహరించారు. బ్యాగ్‌లో 3 ఆపిల్ ఫోన్‌లు, 5 లక్షలు కాష్, సుమారు 10 లక్షల విలువగల బంగారం, పాస్ పోర్ట్, క్రిడిట్ కార్డ్స్ చోరీ అయినట్టు గుర్తించారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇక కొల్లిపర మండలం తూములూరు గ్రామంలో మరో భారీ చోరీ జరిగింది. మోటూరు మధుసూదనరావు ఇంట్లోకి చొరబడ్డ దుండగులు బీరువా తలాలు పగలగొట్టి మరీ చోరీకి పాల్పడ్డారు. 10 లక్షలు విలువ చేసే ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. మధుసూదన రావు రాజోలులో రైస్ మిల్ నడుపుతూ ఉండగా ఆయన భార్య పిల్లలు పండక్కి నరసరావుపేట వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు గత రాత్రి ఇంట్లోకి ప్రవేశించి నగలను అపహరించారు. ఇంటి యజమాని వచ్చి చూడగా.. 96 గ్రాముల ఆభరణాలు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెనాలి నియోజకవర్గంలో రెండు భారీ చోరీలు జరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భారీ వర్షానికి గోడ కూలి ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు



కురుపాం (మన్యం) :అక్టోబరు 3 (సందేశం టైమ్స్): భారీ వర్షానికి గోడ కూలి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం మన్యం జిల్లాలోని కురుపాంలో జరిగింది. కురుపాం మండలంలో ఉన్న ఉదయపురం పంచాయతీలో గల ఉదయపురం కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్ర ఈదురుగాలులకు ఈరోజు ఉదయం గోడకూలి కుంభరిక అరవింద్ అనే వ్యక్తి మృతి చెందగా, అతని అన్నయ్య వినయ్ కు తీవ్రగాయాలయ్యాయి. వినయ్ ను వెంటనే భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ వైద్య సిబ్బంది చికిత్స అందజేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు




చిత్తూరు జిల్లా: అక్టోబరు 3 (సందేశం టైమ్స్): వెదురుకుప్పం మండలం దేవలంపేటలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో విగ్రహం అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనతో స్థానిక దళిత సంఘాలు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత నాయకులు మాట్లాడుతూ, అంబేద్కర్ విగ్రహాన్ని దహనం చేయడం దళితుల ఆత్మగౌరవానికి దెబ్బ కొట్టడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన వారిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# భారీ వర్షానికి రైతన్న వరి పంట నేలమట్టం



వేపాడ (విజయనగరం) :అక్టోబరు 3 (సందేశం టైమ్స్): వేపాడ మండలం కరకవలసి పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన గ్రామమైన కొత్త మారిక గ్రామములో గిన్నెల శోభన్ బాబు వరి పంట నేలమట్టమయ్యింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షం వల్ల గ్రామంలోని పొలాలు నీటమునిగాయి. గిన్నెల శోభన్ బాబు వరి పంట నేలమట్టం అయ్యిందని, ప్రభుత్వం పరిశీలించి పంట నష్టపోయిన రైతును ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. అధికారులు పరిశీలించి పంట నష్టపోయిన రైతును ఆదుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

# విశాఖ పోర్టు జెపి ఆఫ్ సోర్స్ కంపెనీ కార్మికుల ధర్నా




విశాఖ :అక్టోబరు 3 (సందేశం టైమ్స్): విశాఖ పోర్టులోని జెపి ఆఫ్ సోర్స్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ . సిఐటియు ఆధ్వర్యంలో విశాఖపట్నం పోర్టు చైర్మన్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.జగన్ కుమార్, మంగళం రాజు మాట్లాడుతూ విశాఖ పోర్టులోని జెపి ఆఫ్ సోర్స్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలివ్వాలని కోరారు. 8 గంటల పని అమలు చేయాలన్నారు. బకాయి పడిన జీతాలు, సెలవులు, ఓటి చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు.

# నాగావళి ఉధృతి కల్లికోట గ్రామం జలదిగ్బంధం



కొమరాడ (మన్యం) అక్టోబరు 3 (సందేశం టైమ్స్): కొమరాడ మండలం కల్లికోట గ్రామం చుట్టూ నాగావళి నది ప్రవాహం ఉధృతంగా ప్రవహించడంతో గ్రామం చుట్టూ వరదనీరు పోటెత్తింది. దీంతో గ్రామం ప్రజలు జలదిగ్బంధంలో ఉండిపోయారు. సాయంత్రం నుంచి నదిలో నీటి ప్రవాహం పెరగడంతో గ్రామం చుట్టూ పరిసర ప్రాంతాలు వరదనీరు పోటెత్తి నిల్వ ఉండిపోయింది. దీంతో గ్రామంలోని ప్రజలు బయటికి రావాలన్నా గ్రామంలోకి వెళ్లాలన్నా అవకాశం లేకుండా ఉండిపోయింది. దీంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమై బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నాగవల్లి నదిలో నీటి ప్రవాహం తగ్గితే తప్ప బయటకు వచ్చే పరిస్థితి లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# నిలకడగా గోదావరి వరద

## కనకాయలంక గ్రామంలో పడవలలోనే ప్రయాణం



యలమంచిలి :అక్టోబరు 3 (సందేశం టైమ్స్): గోదావరి వరద సాయంత్రం వరకు నిలకడగానే కొనసాగుతోంది. దీంతో మండలంలోని కనకాయలంక, పెద్దలంక బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీ పాలెం, గంగడ పాలెం, దొడ్డిపట్ల తదితర గ్రామాలలో పల్లపు ప్రాంతాలకు చేరిన వరద నీటితో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కనకాయలంక గ్రామంలో స్థానిక ప్రజలు నిత్యవసర సరుకులు మంచినీరు తెచ్చుకోవడానికి నానా అవస్థలు పడుతూ పడవలలో ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పొగాకు ధరలు పతనం

**వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు ఈడీ విశ్వశ్రీ**
**వారంలో కిలోకు రూ.15నుంచి 20తగ్గిన గరిష్ఠ ధరలు**
**%కొండపిలో రైతుల నిరసన.. ఆగిసాగిన వేలం**
**ఒంగోలు–2లో వేలాన్ని పరిశీలించి ఈడీ విశ్వశ్రీ**
**పలు సమస్యలను వివరించిన రైతుప్రతినిధులు**
**కంపెనీల ప్రతినిధులతో బోర్డు అధికారుల భేటీ**



కొనుగోళ్లను పరిశీలించిన ఈడీ విశ్వశ్రీ

ఒంగోలు, అక్టోబరు 3 (సందేశం టైమ్స్): దక్షిణాది పొగాకు మార్కెట్ తిరోగమనంలో నడుస్తోంది. కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్న వేళ ధరలు పెరగాల్సిందిపోయి దిగజారుతున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి గరిష్ఠ ధరలను దిగ్గోస్తున్నారు. వారం రోజులుగా సగటున కిలోకు రూ.15నుంచి రూ.20 మేర ధరలు తగ్గించి వేశారు. నెల క్రితం వరకు దక్షిణాదిలో కిలో గరిష్ఠ ధర రూ.280 ఉండగా క్రమంగా తొలుత రూ.300, తర్వాత రూ.330.. అలా వారం క్రితం వరకూ రూ.346కు పెంచి వ్యాపారులు ఇచ్చారు. దీంతో రైతుల్లో కాస్తంత ఉత్సాహం కనిపించింది. అయితే వారంలోనే వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పతనం దిశగా సాగుతున్నాయి. అత్యధిక శాతం మేలు రకం బేళ్లను కిలో రూ.320 నుంచి రూ.325 లోపే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇంకా తగ్గుతాయన్న సంకేతాలను కూడా బయ్యర్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై బుధవారం కొండపి వేలం కేంద్రంలో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు.

పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ ఒంగోలు–2 వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో కొంతసేపు సమావేశమయ్యారు. దిగజారుతున్న గరిష్ఠ ధరల విషయాన్ని రైతు ప్రతినిధులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు పొగాకు కొనుగోలు చేస్తున్న వివిధ కంపెనీల బయ్యర్లతో స్థానిక ఆర్‌ఎం కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించారు. బోర్డు ఆక్షన్ మేనేజర్ రామాంజనేయులు, ఒంగోలు ఆర్‌ఎం రామారావు ఈ సమావేశాన్ని నిర్వహించి వేలం ప్రక్రియకు ఆటంకం కలగకుండా కొనుగోళ్లు చేయాలని సూచించారు.

# ఫీడర్ కాలువకు టెండర్లు




ఒంగోలు, అక్టోబరు 3 (సందేశం టైమ్స్):: వెలిగొండ తొలిదశను వచ్చే ఏడాది ఆగస్టుకు పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టు అధికారులు మరో అడుగు ముందుకు వేశారు. ప్రస్తుతం అత్యంత కీలకంగా భావిస్తున్న ఫీడర్ కెనాల్ ఆధునికీకరణ పనులకు టెండర్లు పిలిచారు. తీవ్ర ప్రతికూల ఆర్థిక పరిస్థితుల్లోనూ వెలిగొండపై సీఎం ప్రత్యేక దృష్టితో నిధులకు భరోసా ఇచ్చిన విషయం విదితమే. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో చేసిన పనులకు సైతం పేరుకుపోయిన బకాయిల్లో రూ.344 కోట్లు చెల్లింపులను ఇటీవల చేయడంతోపాటు మరో రూ.456 కోట్లను ఫీడర్ కాలువ పనుల కోసం మంజూరు చేశారు. అలా చేసిన వారంరోజులకే ఆ పనులకు ప్రాజెక్టు అధికారులు టెండర్లు పిలిచారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కాలువ పనులు చేసేందుకు రూ.370 కోట్లతో బుధవారం టెండర్లు పిలిచారు. ఈ పనుల కోసం ప్రభుత్వం రూ.456 కోట్లు మంజూరు చేయగా 18 శాతం జీఎస్టీ, సీనరేజ్, ఇతరత్రా పోను రూ.370 కోట్లు అవసరంగా అంచనా వేసి ఆ మేరకు టెండర్లను ప్రాజెక్టు ఎస్‌ఈ అబుత్ అలీ పిలిచారు. ఇందులో ఫీడర్ కాలువ 21.80కి.మీ పొడవునా లైనింగ్ చేస్తారు. కాలువ అడుగు భాగంలో 23 వెడల్పు అలాగే ఇరువైపులా కట్టల లోపలి భాగంలో ఏటవాలుగా ఏడు మీటర్ల వంతున లైనింగ్ చేస్తారు. దోర్నాల మండలంలో కడపరాజుపల్లి వద్ద కాలువకు ఇరువైపులా ఒక్కొక్క వైపు 0.65 కి.మీ వంతున 1.30 కి.మీ, గంటవానిపల్లి వద్ద 2కి.మీ. పెద్దారవీడు మండలం కలుకానిపల్లి వద్ద మరో 2 కి.మీకుపైగా ఒక్కొక్క వైపున కాంక్రీటు గోడలను నిర్మించాలి. ఆ పనులను చేస్తేనే టెన్నెల్ ద్వారా కృష్ణానది నుంచి తీసుకునే నీరు డ్యామ్‌లోకి చేరుతుంది. దీంతో యుద్ధప్రాతిపదికన పనులు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వారం రోజులకే టెండర్లను పిలిచినట్లు ఎస్‌ఈ చెప్పారు. టెండర్లు దాఖలకు ఈనెల 15 వరకు గడువు ఇచ్చారు. ఆన్‌లైన్‌లోనూ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. టెండర్లు దాఖల గడువు ముగిసిన మరుసటి రోజైన ఈనెల 6న దాఖలు చేసిన కంపెనీల సాంకేతిక బిడ్‌లను అధికారులు పరిశీలన చేయాలని నిర్ణయించారు. సాంకేతికంగా అర్హత పొందిన కంపెనీలకు సంబంధించిన ఆర్థిక బిడ్‌లను ఈనెల 22న పరిశీలించి తక్కువ కోడ్ చేసిన కంపెనీకి పనులు కేటాయిస్తారు. నెలాఖరులోగా అగ్రిమెంట్ కూడా పూర్తిచేసి ఆ వెంటనే పనులు ప్రారంభించే ఆలోచనతో అధికార యంత్రాంగం ఉన్నట్లు సమాచారం.

# గుడివాడలో తొలి ఐటీ సంస్థ ప్రారంభం




గుడివాడ (కృష్ణా) :అక్టోబరు 3 (సందేశం టైమ్స్): కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలో తొలి ఐటి కంపెనీ ప్రారంభమయ్యింది. 100 సిట్టింగ్ కెపాసిటీతో ప్రిన్స్‌టన్ ఐటీ సర్వీసెస్ సంస్థ కార్యకలాపాలను విజయదశమి రోజున ప్రారంభించింది. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఐటీ కంపెనీ ప్రారంభోత్సవంలో పాల్గొని, సంస్థ ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మాట్లాడారు. ప్రిన్స్‌టన్ ఐటీ సర్వీసెస్ విజయంపై గుడివాడ సక్సెస్ ఆధారపడి ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ ఐటీ సంస్థను తన సొంత కంపెనీగా భావించి, విజయవంతానికి తన సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. పీ 4 స్ఫూర్తితో ప్రిన్స్‌టన్ సీఈవో రవి తన స్వగ్రామంలో ఐటీ సంస్థ నెలకొల్పడం ఆదర్శప్రాయమని తెలిపారు. ఎమ్మెల్యే రాము సహకారంతో గుడివాడలో ఐటీ సంస్థ నెలకొల్పానని ప్రిన్స్‌టన్ సీఈవో వెల్లడించారు. న్యూజెర్సీ, కెనడా, డొమినికాలతో పాటు హైదరాబాద్, కాకినాడలో ఈ సంస్థ పనిచేస్తుందని తెలిపారు.

# వీరఘట్టంలో అరటి తోట నేలమట్టం



వీరఘట్టం(మన్యం) :అక్టోబరు 3 (సందేశం టైమ్స్):వీరఘట్టంలో అరటి తోటలు నేలమట్టమవడంతో రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. కళింగపట్నం సమీపంగా తీవ్ర వాయుగుండం నేపథ్యంలో ఈదురుగాలులకు తోడు భారీ వర్షంతో అరటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లోని తోటలు చూస్తే గెలలతో ఉన్న అరటి పంట నేలమట్టమై రైతుల కంట నీరు తెప్పిస్తుంది. మరికొద్దిరోజులలో అరటిపంట చేతికి అందుతుందని ఆశించిన సమయంలో తీవ్ర వాయుగుండం కారణంగా అరటి పంట నేలమట్టం అవ్వడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పెదనాన్న అవమానం.. బాలిక ఆత్మహత్య

హైదరాబాద్అక్టోబరు 3 (సందేశం టైమ్స్): మనుషులు మానవత్వాన్ని మరిచిపోయి.. డబ్బు కోసం తన, మన అని తేడా లేకుండా దారుణాలకు పాల్పడుతున్నారు. విచక్షణ రహితంగా ప్రవర్తిస్తూ.. చావులకు కారణం అవుతున్నారు. ఇలాంటి ఘటనే ఒకటి కుత్బుల్లాపూర్, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సొంత పెద్దనాన్న దాష్టికానికి ఓ బాలిక బలైపోయింది. తన పెదనాన్న అవమానించారని ఆత్మహత్యకు పాల్పడింది.పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పింకీ(17) ఆత్మహత్యకు పాల్పడింది. పింకీ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తన తండ్రి చనిపోయిన తర్వాత



అతనికి రావలసిన డబ్బు కోసం సొంత పెదనాన్న అందరి ముందు అవమాన పరచాడని లేటర్లో చెప్పుకొచ్చింది. మానసిక వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొంది.

# కనిష్క జ్యువెలరీ షాపులో భారీ అగ్ని ప్రమాదం



హైదరాబాద్ :అక్టోబరు 3 (సందేశం టైమ్స్): హైదరాబాద్ బేగంపేటలో భారీ అగ్నిప్రమాదం ప్రమాదం జరిగింది. కనిష్క జ్యువెలరీ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. స్థానికులు ఫైర్ సిబ్బంది సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న 3 ఫైరింజన్లు మంటలను అదుపు చేశారు.. అయితే ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమికంగా అంచనా వేశారు. షాపు మూసి ఉన్న సమయంలో అగ్నిప్రమాదం జరగడంతో ప్రాణ నష్టం తప్పింది.

# పుల్ కిక్కే కిక్కు..రికార్డ్ స్థాయిలో మద్యం అమ్మకాలు



హైదరాబాద్, అక్టోబరు 3 (సందేశం టైమ్స్):దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ ఒకటవ తేదీల్లో మందు బాబులు భారీగా మద్యం కొనుగోలు చేశారు. ఈ రెండు రోజుల్లో దాదాపు రూ. 419 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30న రూ.333 కోట్ల మద్యాన్ని మందుబాబులు కొనుగోలు చేశారని ఎక్సైజ శాఖ ప్రకటించింది. అక్టోబర్ ఒకటో తేదీన రూ.86 కోట్ల మద్యం సేల్స్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే సెప్టెంబర్ 26 నుంచి మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి.అయితే అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలతో పాటు మాంసం దుకాణాలు కూడా బంద్ అయ్యాయి. దీని ఎఫెక్ట్ దసరా పండుగపై పడింది. అక్టోబర్ 2న గాంధీ జయంతితో పాటు దసరా పండుగ కూడా వచ్చింది. ఆ రోజు మద్యం షాపు బంద్ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే అంటే అక్టోబర్ 1వ తేదీనే వైన్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. వైన్ షాపులు, లిక్కర్ మార్ట్ ముందు మందుబాబులు క్యూ కట్టిన పరిస్థితి. ఈ క్రమంలో దసరా, అక్టోబర్ 2 ఒకేరోజు వచ్చినప్పటికీ అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగాయిని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

%భీమారం,అక్టోబరు 3 (సందేశం టైమ్స్): ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. భీమారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యరంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అన్ని ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించి మెరుగైన వైద్యసేవలు అందిస్తోందన్నారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.



వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# దసరాకు వెళ్లొస్తూ.. అన్నదమ్ములు మృతి..

సూర్యాపేటఅక్టోబరు 3 (సందేశం టైమ్స్): తుంగతుర్తి మండలం బండరామారం వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైకు అదుపుతప్పి కిందపడటంతో.. బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలసులు సంఘటనా స్థలాని చేరుకున్నారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరశీలించారు. మృతి చెందిన వారిని తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన వేముల నాగరాజు (26), వేముల కార్తీక్ (24)గా గుర్తించారు.మృతులిద్దరు అన్నదమ్ములుగా పోలీసులు చెప్పారు. నాగరాజు హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. తుంగతుర్తిలో అమ్మమ్మ ఇంటికి దసరాకు వచ్చి తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో జరిగినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అన్నదమ్ముల మృతితో మాలిపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.




# రెచ్చిపోయిన కానిస్టేబుల్ ఫ్యామిలీ.. భవానీ భక్తుడిపై దారుణం



నల్లగొండ, అక్టోబరు 3 (సందేశం టైమ్స్): పట్టణంలో జరిగిన చిన్న తప్పిదం కారణంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓ విషయంపై ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై విజిలెన్స్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు దాడి చేశారు. బస్సు డ్రైవర్‌ను చితగ్గొట్టారు. ఈ క్రమంలో బస్‌లోనే ఉన్న ఓ జర్నలిస్ట్.. తన వృత్తిపరంగా వీడియో తీశారు. పైగా అతడు భవాని మాత మాల దీక్షలో ఉన్నారు. వీడియో తీయడాన్నిచూసిన కానిస్టేబుల్ భార్య.. దీక్షలో ఉన్నారని కూడా చూడకుండా జర్నలిస్టుపై అసభ్యకరంగా బూతులతో చెలరేగిపోయింది. పెద్ద పెద్ద పోలీసు అధికారులకు చెప్పినా ఏం చేయలేరంటూ రెచ్చిపోయింది. తాము పోలీస్ డిపార్ట్మెంట్ వాళ్ళమే అంటూ కానిస్టేబుల్ సుపుత్రుడు కూడా రెచ్చిపోయాడు. ఇంతకీ ఏం జరిగిందో ఇప్పుడు తెలుసుకుందాం. హైదరాబాద్ నుంచి నల్లగొండకు వస్తున్న ఆర్టీసీ బస్సు.. క్లాక్ టవర్ సెంటర్‌లో కారుకు అనుకోకుండా తగిలింది. ఆ కారు ఓ విజిలెన్స్ కానిస్టేబుల్‌కు చెందింది.
దీంతో కానిస్టేబుల్ కుటుంబన భ్యులు మితిమీరి ప్రవర్తించారు. డ్రైవర్‌ను చితకబాదడంతో పాటు భవానీ మాల వేసుకున్న జర్నలిస్టుపై కూడా దుర్భాషలాడారు. దీంతో అక్కడ ఘర్షణ చోటు చేసుకుంది. అయితే భవానీ దీక్షలో ఉన్న వ్యక్తి పట్ల అనుచితంగా ప్రవర్తించడంపై భవానీ భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు కానిస్టేబుల్‌పై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో భవానీ భక్తులు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని భవానీ స్వాములు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణకు భారీ వర్ష సూచన.. అన్ని జిల్లాలకు అలర్ట్

హైదరాబాద్: అక్టోబరు 3 (సందేశం టైమ్స్): ఉత్తర వాయువ్య దిశలో కదిలే వాయుగుండం దక్షిణ ఒడిస్సా, ఉత్తర ఆంధ్రకోస్తా తీరాన్ని దాటింది. దీని ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై పడనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.అక్కడక్కడ తేలికపాటి ఉరుములు, మెరుపులతో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని చెప్పింది. సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్,




జనగామ, వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల, హైదరాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతాయని వెల్లడించింది.మరోవైపు ఏపీలో వర్షాలు దంచికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం) ఉత్తర కోస్తాకు ఆనుకొని ఉన్న గోపాల్‌పూర్ సమీపంలో వాయుగుండం తీరం దాటినట్లు విశాఖ వాతావరణ శాఖ తెలిపింది. క్రమంగా ఉత్తర వాయువ్య దిశగా పయనిస్తూ.. బలహీనపడుతోందని పేర్కొంది. ఈ మేరకు ప్రస్తుతం ఉత్తరకోస్తా జిల్లాల్లో.. వర్షం తగ్గుముఖం పట్టినట్లు సమాచారం. అయితే.. రేపు(శనివారం) పలుచోట్ల చెదురుమదురుగా వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు చెప్పింది. ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉన్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# నత్తనడకన రివైజ్డ్ పీపీవో ఆర్డర్ల పంపిణీ

శీరాంపూర్,అక్టోబరు 3 (సందేశం టైమ్స్): రివైజ్డ్ పీపీవో(పెన్షన్ పేమెంట్ ఆర్డర్) పంపిణీ నత్తనడకన సాగుతుండడంతో రివైజ్డ్ పెన్షన్లు అందుకునేందుకు ఎదురుచూస్తున్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల జీవితభాగస్వాములకు నిరాశ ఎదురవుతోంది. ఆర్డర్ల పంపిణీ నత్తనడకన సాగడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంతో మంది కార్మికులు తమ కండలు కరిగించి సింగరేణి అభివృద్ధికి పాటుపడుతున్నారు. రిటైర్ అయిన తరువాత పింఛన్ స్వీకరిస్తున్నారు. ఒకవేళ వారు చనిపోతే వారి జీవిత భాగస్వాములకు 60 శాతం పింఛన్ వస్తుంది. అయితే వీటిని పొందేందుకు బాధితులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.ఈ తరుణంలో త్వరగా పెన్షన్ తీసుకునేందుకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ అధికారులు 27 జూలై 2023న ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం త్వరగా రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ పొందేందుకు విశ్రాంత ఉద్యోగుల ఆధార్ కార్డు, జీవితభాగస్వామి ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్(ఫార్మర్/సర్వైవర్ మోడ్ ఖాతా), పెన్షన్ పేమెంట్ ఆర్డర్, జంటగా దిగిన భార్యాభర్తల ఫొటోలను తాము పనిచేసిన గని/విభాగం సంక్షేమాధికారులకు అందించాలని సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. దీంతో సుదూర ప్రాంతాల్లో ఉన్న విశ్రాంత ఉద్యోగులు దరఖాస్తులు సమర్పించారు. కానీ ఇంతవరకు ఆర్డర్లు అందలేదు. సింగరేణివ్యాప్తంగా 40,000 మంది విశ్రాంత ఉద్యోగులకు రివైజ్డ్ పెన్షన్ ఆర్డర్లు పంపిణీ కాలేదు.ఇలా అందనివారు సీఎంపీఎఫ్ కార్యాలయంలో సంప్రదిస్తే తమకు డేటా రాలేదని, జీఎం కార్యాలయంలో కలిస్తే గనుల నుంచి మాకు రాలేదని, గని సంక్షేమాధికారులను అడిగితే మేము పంపామని ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ




కాలయాపన చేస్తున్నారు. అంతేకాకుండా ఇచ్చిన దరఖాస్తులను సైతం పోగొడుతున్నారని విశ్రాంత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణలు అనేకం ఉన్నాయి.ఈనాటి కాలంలో వెబ్‌సైట్ నుంచి ఆధార్, పాన్, లైఫ్ సర్టిఫికెట్, అనేక రకాల సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని వినియోగిస్తున్నాం. కానీ పెన్షన్ ఆర్డర్లు మాత్రం మ్యాన్‌వల్‌గా పొందాల్సి వస్తోంది. డౌన్‌లోడ్ సౌకర్యం కల్పించినట్లయితే అనేక రకాలుగా ఉపయోగకరంగా ఉంటుంది.

# ఈ నెల 10 నుంచి సెట్ పరీక్ష దరఖాస్తుల స్వీకరణ



హైదరాబాద్, అక్టోబరు 3 (సందేశం టైమ్స్): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉద్యోగాలకు అర్హత కల్పించే.. సెట్(రాష్ట్ర అర్హత పరీక్ష) పరీక్ష డిసెంబరు రెండోవారంలో జరగనుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయం విడుదల చేసింది. మూడు గంటల వ్యవధి గల పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయని వర్సిటీ టీజీ సెట్ కార్యదర్శి ఆచార్య బి. శ్రీనివాస్ తెలిపారు. వరీక్ష సీబీటీ(కంప్యూటర్ ఆధారిత వరీక్ష) వద్ధతిలో ఉంటుందని, ఈనెల 10 నుంచి
ఆన్‌లైన్లో దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు





# క్రీడావార్తలు





## ఢిల్లీలో ఆర్చరీ లీగ్-2025 ప్రారంభించిన రామ్ చరణ్





ఢిల్లీ, అక్టోబర్ 3: హీరో రామ్ చరణ్ ఢిల్లీలో ఆర్చరీ ప్రీమియర్ లీగ్–2025ని ప్రారంభించారు. ఆర్చరీ క్రీడను ఒక 'ఐకానిక్ స్పోర్ట్'గా చెప్పిన చరణ్.. ఈ లీగ్ భారతదేశంలో మొట్టమొదటి ఆర్చరీ ఫ్రాంచైజీ టోర్నమెంట్‌గా నిలుస్తుందన్నారు. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన ఈ ఆర్చరీ ప్రీమియర్ లీగ్ 2025ని ప్రారంభించడం సంతోషకరమని చరణ్ అన్నారు. ఢిల్లీలోని యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ ప్రారంభ వేడుకలో 48 మంది ఆర్చర్లు (36 మంది భారతీయులు, 12 మంది విదేశీయులు) ఆరు ఫ్రాంచైజీల్లో పోటీ పడుతున్నారు. ఇది రికర్వ్ అండ్ కాంపౌండ్ ఆర్చర్లు ఫ్లడ్‌లైట్స్ కింద పోటీపడే ప్రత్యేక ఫార్మాట్‌ను భారత్‌కు పరిచయం చేస్తుంది. ఈ లీగ్ కు బ్రాండ్ అంబాసిడర్ కూడా అయిన రామ్ చరణ్, ఆర్చరీని 'ఐకానిక్ స్పోర్ట్' అన్నారు. 'ఇది మన చరిత్ర, సంస్కృతిలో భాగం. రామాయణం, మహాభారతంలో ఆర్చరీ ఉంది. నేను %===% సినిమాలో ఆర్చర్ పాత్ర చేశాను. ఈ క్రీడతో మన సంబంధం ముడిపడిఉంది' అని చెప్పారు. భారతీయ క్రీడా ప్రియులు ఈ ఐకానిక్ స్పోర్ట్‌ను ప్రోత్సహించాలని, లీగ్‌ను ఐకానిక్‌గా మార్చాలని రామ్ చరణ్ పిలుపునిచ్చారు. కాగా, ఈ ఆర్చరీ లీగ్ ద్వారా.. దేశంలో దాగి ఉన్న ప్రతిభకు అవకాశాలు వస్తాయని, అదే సమయంలో భారతీయ ఆర్చరీకి అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ దక్కుతుందని %ూాూ×% అధ్యక్షుడు అర్జున్ ముండా తెలిపారు. 2028, 2032 ఒలింపిక్స్‌కు భారత క్రీడాకారుల్ని తయారు చేయడానికి కూడా ఈ లీగ్ సహకరిస్తుందని ఆయన చెప్పారు. ఈ పోటీలు అక్టోబర్ 2 నుంచి 12 వరకు జరుగుతాయి

## మహిళల వరల్డ్ కప్.. పాక్ జట్టుతో టీమిండియా జట్టు షేక్ హ్యాండ్‌పై బీసీసీఐ సెక్రెటరీ స్పందన



ఇంటర్నెట్ డెస్క్: ఆసియా కప్‌లో భారత్–పాక్ హ్యాండ్ షేక్ అంశం ఎంతటి వివాదానికి దారి తీసిందో తెలిసిందే. ఇక మహిళల వరల్డ్ కప్‌లో కూడా ఇదే సీన్ రిపీట్ కానున్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి బీసీసీఐ సెక్రెటరీ దేవజిత్ సైకియా తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. గతం వారం రోజుల్లో పాక్‌తో బంధంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు %ఆసియా కప్ సీన్ ఈ వరల్డ్ కప్‌లో రిపీట్ అవుతుందా అంటూ మీడియా వేసిన ప్రశ్నకు దేవజిత్ స్పందించారు. నేరుగా సమాధానం ఇవ్వకుండా కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ విషయమై ఇప్పుడే నేనేమీ చెప్పలేను. కానీ శత్రుదేశంతో సంబంధాల్లో ఎలాంటి మార్పు లేదు. గతం వారంలో కూడా కొత్త మార్పులేమీ రాలేదు. అయితే, కొలంబోలో పాక్‌తో భారత్ తలపడుతుంది. గేమ్‌కు సంబంధించి అన్ని ప్రొటోకాల్స్ యథాతథంగా సాగుతాయి. ఎమ్‌సీసీ నిబంధనలు అలాగే కొనసాగుతాయి. అయితే హ్యాండ్ షేక్స్, హగ్స్ గురించి మాత్రం ఇప్పుడే ఏమీ చెప్పలేము' అని అన్నారు అయితే, పాక్‌తో మ్యాచ్ సందర్భంగా మునుపటి సీన్‌లే రిపీట్ అయ్యే అవకాశం ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. టాస్ సందర్భంగా, ఆ తరువాత మ్యాచ్ ముగిశాక ప్రత్యర్థి జట్టు సభ్యులతో కరచాలనం చేయొద్దని టీమిండియా సభ్యులకు సూచనలు వెళ్లినట్టు సమాచారం. మహిళల వరల్డ్ కప్ సెప్టెంబర్ 30 నుంచి మొదలైన విషయం తెలిసిందే. శ్రీలంకపై జరిగిన మ్యాచ్‌లో భారత్ 59 పరుగుల తేడాతో సులువుగా విజయం సాధించింది. అంతర్జాతీయ టోర్నీల్లో భాగంగా భారత్, పాక్ మధ్య మ్యాచులన్నీ తటస్థ వేదికల్లో జరిగేలా షెడ్యూల్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే భారత్, పాక్ మ్యాచ్ కొలంబో వేదికగా జరగనుంది.

## టాస్ గెలిచిన వెస్టిండీస్.. మొదటి బ్యాటింగ్ ఎవరిదంటే..



ఆసియా కప్ విజయోత్సాహం పూర్తిగా చల్లారకముందే టీమిండియా మరో సమరానికి సిద్ధమైంది. దాదాపు పది నెలల విరామం తర్వాత స్వదేశంలో ఓ టెస్ట్ సిరీస్ ఆడుతోంది . వెస్టిండీస్‌తో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడబోతోంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా ఈ రోజు తొలి టెస్ట్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ చేజ్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. దీంతో టీమిండియా బౌలింగ్‌కు రెడీ అవుతోంది. ఇద్దరు ప్రధాన పేసర్లు అయిన జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ ఈ మ్యాచ్ ఆడుతున్నారు%భారత్: శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, కుల్‌దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ వెస్టిండీస్: త్యాగ్‌నారయణ్ చంద్రపాల్, జాన్ క్యాంప్‌బెల్, అలిక్ అథనేజ్, బ్రెండన్ కింగ్, షై హెూప్, రోస్టన్ చేజ్, జస్టిన్ గ్రీవ్స్, జొమెల్ వారికన్, ఖేరీ ఫియెరీ, జాన్ లైన్, జైడెన్ సీల్స్

## పాక్ క్రికెట్‌లో సంక్షోభం.. నఖ్వీ రాజీనామా చేయాలని అఫ్రీది డిమాండ్..



ఆసియా కప్‌లో భారత జట్టు చేతిలో వరుసగా మూడు సార్లు ఓడిపోవడం పాకిస్థాన్ క్రికెట్‌లో సంక్షోభానికి కారణమవుతోంది. ముఖ్యంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాక్ క్రికెట్ అభిమానులతో పాటు ఆ దేశ మాజీ ఆటగాళ్లు కూడా నఖ్వీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నఖ్వీ రాజీనామా చేయాలని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది డిమాండ్ చేశాడు ఒకవైపు క్రికెట్ బోర్డు చీఫ్‌గా, మరోవైపు పాకిస్తాన్ హెూంమంత్రిగా రెండు కీలక పదవులను నఖ్వీ నిర్వహించడం సరికాదని, క్రికెట్‌కు పూర్తి స్థాయి శ్రద్ధ అవసరమని అఫ్రిది పేర్కొన్నాడు. ఆసియా కప్‌లో పాక్ జట్టు ఘోర పరాజయం, ట్రోఫీ చుట్టూ జరిగిన వివాదాల నేపథ్యంలో అఫ్రిది ఈ వ్యాఖ్యలు చేశాడు. గతంలో కూడా నఖ్వీకి అఫ్రీది ఇలాంటి సలహానే ఇచ్చాడు. నఖ్వీ నిర్వహిస్తున్న రెండూ పదవులు చాలా ముఖ్యమైనవని, ఈ రెండింటికీ చాలా శ్రద్ధం, సమయం అవసరమని చెప్పాడు %'నఖ్వీ ప్రస్తుతం రెండు ముఖ్యమైన పదవుల్లో ఉన్నారు . హెూం మంత్రిత్వ శాఖ, క్రికెట్ బోర్డ్.. రెండూ వేర్వేరు ప్రపంచాలు. ఈ రెండింటినీ ఒకరు హ్యాండిల్ చేయడం కుదరదు. పాక్ క్రికెట్ కోసం చాలా సమయం వెచ్చించాలి. సలహాదారులపై ఆధారపడితే పని జరగదు. తనకు క్రికెట్ గురించి తెలియదని నఖ్వీనే పలుసార్లు చెప్పారు. సమర్థుడైన వ్యక్తికి పీసీబీ ఛీఫ్ పదవి అప్పగించాలి' అని అఫ్రీది డిమాండ్ చేశాడు.

## వెస్టిండీస్ తడబాటు.. తొలి ఇన్నింగ్స్‌లో స్కోరు ఇదీ

ఇంటర్నెట్ డెస్క్: అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో భారత బౌలర్ల ధాటికి వెస్టిండీస్ తడబడింది. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 162 పరుగులకే ఆలౌట్ అయిపోయింది. టాస్ గెలిచిన వెస్టిండీస్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ భారత బౌలర్ల ధాటికి టాప్ ఆర్డర్ పేక మేడలా కూలిపోయింది. ఓపెనర్లు త్యాగ్ నారాయణ్ చందర్‌పాల్ (0), జాన్ క్యాంప్‌బెల్ (8) కీలక సమయాల్లో పెవిలియన్ బాట పట్టారు మిడిల్ ఆర్డర్ కాస్త పోరాడినా పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. జస్టిన్ గ్రీవ్స్ (32), రాస్టన్ ఛేజ్ (24), షాయ్ హెూప్ (26) రెండంకెల స్కోరు చేయగలిగినా చివరకు భారత బౌలర్ల ధాటికి త్వరగానే వికెట్లు సమర్పించుకున్నారు. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ ఏకంగా 4 వికెట్లు తీసి వెస్టిండీస్ బ్యాటింగ్ లైనప్ కుప్పకూలేలా చేశాడు. ఇక జస్‌ప్రీత్ బుమ్రా (3), కుల్‌దీప్ యాదవ్ (2), వాషింగ్టన్ సుందర్ (1) కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ప్రస్తుతం



తన తొలి ఇన్నింగ్స్‌ను మొదలెట్టిన భారత్ 2.4 ఓవర్లు ముగిసేసరికి 23 పరుగులు చేసింది. క్రీజ్‌లో ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ ఉన్నారు.

## విండీస్ పోటీనిచ్చేనా




అహ్మదాబాద్: స్వదేశంలో టెస్ట్ సిరీస్ అంటే భారత్ తిరుగుండదు. కానీ, న్యూజిలాండ్ చేతిలో 0–3తో ఘోర పరాజయం తర్వాత అంతా తారుమారైంది. అయితే, సొంతగడ్డపై కొత్త కెప్టెన్ శుభ్‌మన్ ఘనంగా బోణీ చేయాలనుకొంటున్నాడు. వెస్టిండీసతో రెండు టెస్ట్‌ల సిరీసలో భాగంగా తొలి మ్యాచ్ గురువారం నుంచి జరగనుంది. ర్యాంకింగ్స్‌లో భారత్ నాలుగు.. విండీస్ ఎనిమిదో స్థానంలో ఉన్నాయి. విండీస్ ఫామ్ దృష్ట్యా ఈ మ్యాచ్‌లో భారత్ ఫేవరెట్ అనడంతో ఎటువంటి సందేహం లేదు. అయితే, కరీబియన్లు ఏమేరకు పోటీ ఇస్తారనేదే ఆసక్తికరం. ఆసియా కప్ ముగిసిన వెంటనే స్వదేశానికి చేరుకొన్న గిల్ టెస్ట్ మోడ్‌లోకి మారిపోయాడు. టీ20ల్లో గిల్ ఆశించిన రీతిలో రాణించలేకపోయినా.. ఇంగ్లండ్ సిరీసలో తరహాలో మరోసారి చెలరేగాలనుకొంటున్నాడు. అంతేకాకుండా డబ్ల్యూటీసీ పాయింట్లు కూడా భారత్‌కు ఎంతో కీలకం. అయితే, మేఘావృతమైన వాతావరణానికి తోడు పిచ్‌పై పచ్చిక ఎక్కువగా ఉండడంతో టీమ్ కూర్పుపై సస్పెన్స్ కొనసాగుతోంది. రోహిత్, కోహ్లీ, అశ్విన్ రిటైర్మెంట్ తర్వాత స్వదేశంలో జరుగుతున్న తొలి సిరీస్ కావడంతో వారి స్థానాలను ఎవరు భర్తీ చేస్తారో చూడాలి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతుల్యత కనిపిస్తోంది. అయితే, పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్, బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్‌లో ఎవరికి తుదిజట్టులో చోటు దక్కుతుందనేది చూడాలి. జడేజా, కుల్దీప్ స్పిన్ విభాగానికి నేతృత్వం వహించనుండగా.. కౌంటీలు ఆడి వచ్చిన వాషింగ్టన్ సుందర్ తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. కరుణ్ నాయర్‌పై వేటుపడడంతో.. వన్‌డౌన్‌లో సాయి సుదర్శన్ స్థానానికి ఢోకాలేదు. ఓపెనర్ కేఎల్ రాహుల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. జైస్వాల్ కొంత బ్రేక్ తర్వాత బరిలోకి దిగుతున్నాడు. బుమ్రా, సిరాజ్ పేస్ భారాన్ని మోయనున్నారు.

## సిరాజ్ జోరు.. మొదటి టెస్ట్‌లో విండీస్ తడబాటు..

దాదాపు పది నెలల విరామం తర్వాత స్వదేశంలో టెస్ట్ సిరీస్ ఆడుతున్న టీమిండియా సత్తా చాటుతోంది. వెస్టిండీస్‌తో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో శుభారంభం చేసింది. టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ చేజ్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. దీంతో బౌలింగ్‌కు దిగిన టీమిండియా ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించింది హైదరాబాదీ బౌలర్ మహ్మద్ సిరాజ్ నిప్పులు చెరిగే బంతులతో విండీస్ బ్యాటర్లకు వణుకు పుట్టించాడు. ఏకంగా నాలుగు కీలక వికెట్లను పడగొట్టాడు. చంద్రపాల్, అథనాజే, బ్రండన్ కింగ్, రోస్టన్ ఛేజ్ వంటి




టాపార్డర్ బ్యాటర్లను పెవిలియన్ చేర్చాడు. జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. విండీస్ బ్యాటర్లలో ఇప్పటివరకు ఒక్కరూ కూడా 30 పరుగులు దాటి చేయలేదు. ప్రస్తుతానికి విండీస్ 32 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 133 పరుగులతో ఆడుతోంది.

# బిజినెస్



## టాప్ ప్లేస్‌లో అంబానీ..
## దేశంలో అత్యంత సంపన్నులు వీరే..



%రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ మరోసారి మనదేశంలో అత్యంత సంపన్నుడిగా నిలిచారు. హరున్ ఎం3ఎం తాజాగా ఇండియా సంపన్నుల జాబితా-2025ను ప్రకటించింది . కుటంబ సభ్యుల సంపదతో కలిపి ముఖేష్ మొత్తం ఆస్తి 9.55 లక్షల కోట్ల రూపాయలు . ఇక, ఈ జాబితాలో అదానీ గ్రూప్ సంస్థల అధిపతి గౌతమ్ అదానీ 8.15 లక్షల కోట్ల రూపాయల సంపదతో రెండో స్థానంలో ఉన్నారు. ఇక, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అధినేత రోష్ని నాడార్ మల్హోత్రా ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నారు. మొత్తం 2.84 లక్షల కోట్ల సంపదతో రోష్ని నాడార్ దేశంలోనే అత్యంత ధనికురాలైన మహిళగా నిలిచారు. దేశంలోని టాప్-3 సంపన్నుల జాబితాలో ఒక మహిళ చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి. అలాగే 44 ఏళ్ల వయసులోనే ఈ ఘనత సాధించి చిన్న వయసులోనే టాప్-10 సంపన్నురాలిగా నిలిచిన మహిళగా రోష్ని ఘనత దక్కించుకున్నారు.

## రెపో రేటు యథాతథం

ముంబై కీలక స్వల్ప కాలిక 'రెపో' రేటును ప్రస్తుతం ఉన్న 5.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగిన సమావేశంలో ఎంపీసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఎంపీసీ రెపోరేటును యథాతథంగా 5.5 శాతం వద్ద కొనసాగించడం వరుసగా ఇది రెండో సారి. ఈ వడ్డీరేటు పైనే బ్యాంకులు, ఆర్‌బీఐ నుంచి స్వల్పకాలిక రుణాలు తీసుకుంటాయి. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టి, జీడీపీ వృద్ధి రేటు ఆశాజనకంగా ఉండడంతో ఎంపీసీ ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. సుంకాల పోటు ప్రభావంపై ఇంకా ఒక అంచనాకు రాకపోవడం కూడా ఇందుకు దోహదం చేసిందని తెలుస్తోంది.

ద్రవ్యోల్బణం మరింత కిందికే

అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి ఉన్నా, వచ్చే ఆరు నెలల్లోనూ మన దేశంలో ధరల సెగ పెద్దగా ఉండకపోవచ్చని ఆర్‌బీఐ భావిస్తోంది. ఆహార ఉత్పత్తుల ధరలు బాగా తగ్గ డం ఇందుకు దోహదం చేయనుందని మల్హోత్రా చెప్పారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను గతంలో ప్రకటించిన 3.1 శాతం నుంచి 2.6 శాతానికి కుదిస్తున్నట్టు చెప్పారు. ఇదే సమయంలో ఈ ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటు అంచనాల్ని ఆర్‌బీఐ 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచింది.

షేర్ మార్కెకు ఊతం

ఎంపీసీ దేశీయ స్టాక్ మార్కెట్‌కు మేలు చేసే కొన్ని నిర్ణయాలు తీసుకుంది. తొలి పబ్లిక్ ఇష్యూల్లో (ఐపీఓ) ఇన్వెస్ట్ చేసే మదుపరులకు బ్యాంకులు ఇచ్చే రుణపరిమితిని ప్రస్తు త రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచింది. ఈ వెసులుబాటు రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులకు (ఇన్విట్స్) కూడా వర్తిస్తుందని తెలిపింది. దీనికి తోడు లిస్టెడ్ కంపెనీల షేర్ల హామీపై బ్యాంకులు మదుపరులకు ఇచ్చే రుణ పరిమితిని ప్రస్తుత రూ.20 లక్షల నుంచి రూ.కోటికి పెంచాలని ప్రతిపాదిస్తున్నట్టు గవర్నర్ చెప్పారు. దేశంలో క్యాపిటల్ మార్కెట్ అభివృద్ధికి ఈ చర్య మరింత దోహదం చేస్తుందన్నారు.

ఎగుమతిదారులకు ఊరట

అమెరికా సుంకాల పోటును దృష్టిలో ఉంచుకుని ఎగుమతిదారులను ఆదుకునేందుకు ఎంపీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విదేశీ బ్యాంకుల్లో ఐఎఫఎససీ ఖాతాల్లో ఉన్న ఎగుమతి నిధులను భారత్‌కు బదిలీ చేసే గడువుని ప్రస్తుత నెల రోజుల నుంచి మూడు నెలలకు పెంచాలని నిర్ణయించింది. వస్తు దిగుమతి చెల్లింపుల లావాదేవీల గడువు కూడా నాలుగు నెలల నుంచి ఆరు నెలలకు పెంచుతున్నట్టు ప్రకటించింది.

రూపాయి అంతర్జాతీయీకరణ

రూపాయి చెల్లింపులను ప్రోత్సహిచేందుకు ఆర్‌బీఐ కొన్ని చర్యలు ప్రకటించింది. ఇందులో భాగంగా భూటాన్, శ్రీలంక, నేపాల్ దేశాల కంపెనీలకు అనుమతించిన దేశీయ బ్యాంకు లు 'రూపాయి' రుణాలు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే దేశీయ బ్యాంకుల్లో స్పెషల్ రూపీ వోస్ట్రో అకౌంట్ (ఎస్ఆర్‌వీఏ) ఖాతాల్లో నిధులున్న విదేశీ బ్యాంకులు, ఆ నిధులను దేశీయ కంపెనీల రుణ పత్రాలు, కమర్షియల్ పేపర్స్‌లో పెట్టుబడి పెట్టేందుకు అనుమతించింది.

ఎంపీసీ ఇతర ప్రధాన నిర్ణయాలు

నో ఫ్రిల్స్ బ్యాంకు ఖాతాదారులకూ ఉచితంగా డిజిటల్ లావాదేవీల సేవలు.

మరింత పటిష్టంగా అంబుడ్స్‌మన్ వ్యవస్థ.

అంబుడ్స్‌మన్ పరి?ధిలోకి గ్రామీణ సహకార బ్యాంకులు.

లిస్టెడ్ కంపెనీల విలీనాలు, కొనుగోళ్లకు రుణాలు సమకూర్చేందుకు దేశీయ బ్యాంకులకు అనుమతి.

కొత్త పట్టణ సహకార బ్యాంకులకు లైసెన్సులపై త్వరలో చర్చా పత్రం.

యూపీఐ లావాదేవీలపై

ఎలాంటి చార్జీ ఉండదు

యూపీఐ చెల్లింపు లావాదేవీలపై చార్జీలు విధిస్తారన్న వార్తలను ఆర్‌బీఐ గవర్నర్ తోసిపుచ్చారు. అసలు అలాంటి ప్రతిపాదనే తమ వద్ద లేదన్నారు. అయితే క్రెడిట్ కార్డులపై కొనుగోలు చేసే మొబైల్ ఫోన్ల ఈఎంఐలు సక్రమంగా చెల్లించకపోతే, బ్యాంకులు ఆ ఫోన్లను రిమోట్ పద్దతిలో లాక్ చేసే విషయాన్ని మాత్రం పరిశీలిస్తున్నట్టు తెలిపారు. అనుకూల, ప్రతికూల అంశాలు అన్నిటిని కూలంకషంగా చర్చించాకే దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వరరావు చెప్పారు

## స్కీమ్ గడువు డిసెంబర్ 31 వరకు పొడిగింపు.. వీరికి మంచి ఛాన్స్..

కేంద్ర ప్రభుత్వం టెక్స్‌టైల్స్ రంగంలో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును డిసెంబర్ 31, 2025 వరకూ పొడిగించింది. ఈ నిర్ణయం శుక్రవారం టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఈ స్కీమ్ కు టెక్స్‌టైల్స్ పరిశ్రమ నుంచి అనూహ్యమైన స్పందన వచ్చిన నేపథ్యంలో ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఈ స్కీమ్ కోసం అప్లై చేసుకునేందుకు అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా (డిసెంబర్ 31, 2025 వరకూ అవకాశం ఉంటుంది. దేశీయ మాన్యుఫ్యాక్చరింగ్‌ను ప్రోత్సహించడమే కాకుండా, గ్లోబల్ మార్కెట్లలో పోటీతత్వాన్ని పెంపొందించాలన్నది దీని ప్రధాన ఉద్దేశం.ఈ నిర్ణయం ద్వారా ఎక్కువ మంది పెట్టుబడిదారులు ఈ స్కీమ్ లో పాల్గొనే అవకాశం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమ నుంచి వస్తున్న ఆసక్తిని ప్రోత్సహించడానికి, పెట్టుబడిదారులకు మరో అవకాశం ఇవ్వడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.%లూ×% స్కీమ్ టెక్స్‌టైల్ రంగంలో మాన్ మేడ్ ఫైబర్ (%వీవీఖీ%) దుస్తులు, %వీవీఖీ% ఫ్యాబ్రిక్స్, టెక్స్‌టైల్స్ వంటి విభాగాల్లో పెద్దఎత్తున ఉత్పత్తిని ప్రోత్సహించడానికి రూపొందించబడింది. ఆగస్టు 2025లో ఆహ్వానించిన దరఖాస్తుల్లో భాగంగా ఈ విభాగాల నుంచి అనేక దరఖాస్తులు వచ్చాయి. ఈ స్కీమ్ ద్వారా భారతదేశ టెక్స్‌టైల్ రంగంలో పోటీతత్వాన్ని పెంచడం, పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా పెట్టుకుంది.భారత్ ప్రపంచంలో ఆరో అతిపెద్ద టెక్స్‌టైల్ ఎగుమతి దేశంగా ఉంది. చైనా, బంగ్లాదేశ్, వియత్నాం, జర్మనీ, ఇటలీ వంటి దేశాలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. భారత టెక్స్‌టైల్ పరిశ్రమ ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమల్లో ఒకటిగా ఉంది. ఇది సహజ ఫైబర్‌లు (పత్తి, పట్టు, ఉన్ని, జనపనార) మాన్-మేడ్ ఫైబర్ వంటి ముడి సరుకులపై ఆధారపడి ఉంది. ఫైబర్ నుంచి ఫ్యాబ్రిక్ దుస్తుల వరకు మొత్తం భారతదేశం బలమైన ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది.

220కి పైగా దేశాలకు..




2024-25 ఆర్థిక సంవత్సరంలో టెక్స్‌టైల్స్, దుస్తుల ఎగుమతులు 2023-24తో పోలిస్తే సుమారు 5.2% వృద్ధిని సాధించాయి. భారతదేశం ప్రస్తుతం 220కి పైగా దేశాలకు దుస్తులను ఎగుమతి చేస్తోంది. అయినప్పటికీ ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, కొన్ని మార్కెట్లలో సుంకం అసమానతలు నెలకొన్నాయి. ఈ క్రమంలో 2030 నాటికి రూ. 9 లక్షల కోట్ల ఎగుమతులను సాధించాలని టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

భారత టెక్స్‌టైల్స్‌ను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు

ఫ్రీ ట్రేడ్ ఒప్పందాలు భారతదేశం 15 దేశాలతో %ఖీూా%లను కుదుర్చుకుంది. ఇటీవల భారత్-యూకే మధ్య సీఈటీఏ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాలు సుంకం, సుంకేతర అడ్డంకులను తగ్గించడం, విధానాలను సరళీకరించడం ద్వారా భారత ఎగుమతిదారులకు పోటీతత్వాన్ని పెంచుతాయిూార్కులు: ఆధునిక, సమీకృత, ప్రపంచ స్థాయి టెక్స్‌టైల్ మౌలిక సదుపాయాలను సృష్టించడానికి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్స్ అండ్ అపెరల్ ( పార్కుల స్కీమ్ ప్రారంభించబడింది. స్కీమ్: %వీవీఖీ% ఫాబ్రిక్, దుస్తులు, టెక్నికల్ టెక్స్‌టైల్స్‌లో పెద్దఎత్తున ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ఈ స్కీమ్ రూపొందించబడింది. దీంతోపాటు భారత్ అనేక విషయాల్లో ఈ రంగం అభివృద్ధి కోసం కృషి చేస్తోంది.

## జన్‌ధన్ ఖాతాదారులకు బిగ్ అలర్ట్




న్యూఢిల్లీ, అక్టోబర్ 03: జన్‌ధన్ యోజన ద్వారా బ్యాంక్ అకౌంట్లు పొందిన ఖాతాదారులకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియ కీలక సూచన చేసింది. ఈ ఖాతాలకు రీ కేవైసీ చేయాల్సి ఉందని స్పష్టం చేసింది. ఈ రీకేవైసీకి సెప్టెంబర్ 30వ తేదీ వరకు గడువు విధించినట్లు వెల్లడించింది. ఈ క్రమంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు పంచాయతీ స్థాయిలో రీ కేవైసీ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు.. వాటిని వినియోగించుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. ఈ క్యాంపుల్లో రీ కేవసీతోపాటు మైక్రో ఇన్సూరన్స్, పెన్షన్ పథకాలపై సైతం దృష్టి సారించినట్లు వెల్లడించింది. ఇంతకీ రీకేవైసీ అంటే ఏమిటంటే..రీ కేవైసీ అనేది ఖాతాదారుల వ్యక్తిగత వివరాలు, చిరునామా తదితర అంశాలను అప్ డేట్ చేసే ప్రక్రియ. మీ కేవేసీ గడువు తేదీ ముగిసినా లేదా మీకు సంబంధించిన వివరాలు మారినా.. నిబంధనల ప్రకారం బ్యాంక్‌కు తాజా సమాచారం అందించాల్సి ఉంటుంది. ఈ జన్‌ధన్ ఖాతాలు తెరిచి 10 ఏళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో ఈ రీకేవైసీ ప్రక్రియన చేపడుతున్నారు. ఈ సదుపాయాన్ని ఆయా క్యాంపుల్లో వినియోగించుకోవచ్చు. అలాగే ఆన్‌లైన్‌లోనూ రీకేవైసీని పూర్తి చేసే సౌకర్యాన్ని ఆర్‌బీఐ కల్పించింది.

అత్యధిక ఖాతాలు.. ఆ బ్యాంకులోనే..

అయితే ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఒకటైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో జన్‌ధన్ ఖాతాలు అత్యధిక సంఖ్యలో ఉన్నాయి. మీ జన్‌ధన్ ఖాతా ఈ బ్యాంకు శాఖలో ఉన్నట్లు అయితే.. ఆన్‌లైన్‌లోనూ రీ కేవైసీ చేసుకునే వెసులుబాటును కల్పించింది. అందుకోసం ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్ ద్వారా లాగిన్ కావాల్సి ఉంది.

ఇంతకీ జన్‌ధన్ ఖాతాలు అంటే ఏమిటీ?

2014లో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం కొలువు తీరింది. దీంతో నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించాలనే ఉదేశ్యంతో ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా ఉండాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ ఖాతాల ద్వారా ప్రజలు భద్రంగా తమ నగదును పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులభతరం చేసింది. ఈ ఖాతాల్లో పైసా నగదు లేకుండా నిర్వహించుకునే వెసులుబాటును సైతం కల్పించింది. ఇటీవల ఈ ఖాతాలు ఉన్న ఖాతాదారులకు చెక్కు సౌకర్యాన్ని సైతం కల్పించారు.

## పసిడి ప్రియులకు శుభవార్త.. తగ్గిన బంగారం ధరలు..

బంగారం పెట్టుబడులకు స్వర్గధామంగా మారిపోయింది. భూముల మీద పెట్టుబడులు పెట్టిన వాళ్లు, బంగారం మీద పెట్టుబడులు పెట్టిన వారు నష్ట పోయినట్లు చరిత్రలో లేదు అన్నట్లుగా పరిస్థితి మారింది. బంగారం ధరలు నెల,నెలకు విపరీతంగా పెరుగుతూనే పోతున్నాయి. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధర 1,18,000 వేల దగ్గర ట్రేడ్ అవుతోంది. భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. గుడ్ రిటర్న్స్ కథనం ప్రకారం ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

భాగ్య నగరంలో నిన్న బంగారం ధరలు ఇలా..




నగరంలో నిన్న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,18, 690 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది.10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 1,08,800 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 89,020 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు తగ్గింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,18, 680 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 1,08,790 దగ్గర ట్రేడ్ అవుతోంది..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 89,010 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

వెండి ధరలు ఇలా..

నిన్న హైదరాబాద్ మహా నగరంలో కేజీ వెండి ధర 1,64,000 దగ్గర ట్రేడ్ అయింది. 100 గ్రాముల వెండి ధర 16,400 దగ్గర ట్రేడ్ అయింది. బంగారం ధరలతో సంబంధం లేకుండా వెండి ధరలు పెరుగుతున్నాయి.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006